ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 48 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప శనివారం 25 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 48 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA SAT 25 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur






# బస్సు బుగ్గి

## కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

## క్షణాల్లో 22 మంది సజీవ దహనం

- హైదరాబాద్ నుంచి బెంగళూరుకు జర్నీ
- వేమూరి కావేరి బస్సుకు అంటుకున్న నిప్పు
- ఇప్పటి వరకు 19 మంది మృతదేహాలు వెలికితీత
- బస్సు ప్రమాదానికి కారణమైన బైకర్, అనధికారికంగా క్యారేజీ కేబిన్లో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు మృతి..
- ప్రమాద సమయంలో ఇద్దరు డ్రైవర్లతో సహా 43 మంది
- బస్సు నుంచి సురక్షితంగా బయటపడ్డ 23 మంది

### బస్సు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నాం

హెూంమంత్రి అనిత



- కర్నూలు జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం..
- దుర్ఘటనపై 16 బృందాలతో లోతైన దర్యాప్తునకు ఆదేశం
- ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాల గుర్తింపు ప్రక్రియ

చిమ్మచీకట్లో 90 కిలోమీటర్ల వేగంగా దూసుకుపోతున్న ఓ ప్రైవేటు బస్సు అంతలోనే చిన్న కుదువు.. ఏం జరిగింటే తెలుసుకునే లోపే బస్సులో అగ్నిప్రళయం.. క్షణాల్లో 22 మంది జీవితాలు సజీవదహనం అయ్యాయి. ఊహకు అందని విషాదం.. కర్నూలు జిల్లాలో కుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు భయానక దృశ్యం.. కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలోని ఉల్లిందకొండ క్రాస్ వద్ద ప్రయాణికు లతో వెళ్తున్న ప్రైవేట్ వేల్స్ బస్సును బైక్ డీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు అంటుకుని నిమిషాల్లోనే బస్సును చుట్టుముట్టాయి. అక్కడికక్కడే 22 మంది సజీవదహనం కాగా, మరో 23 మంది మరక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదానికి కారణమైన బైకర్ శంకర్, అనధికారికంగా క్యారేజ్ కేబిన్లో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు కాలిబూడిదయ్యారు.. దీంతో మృతుల సంఖ్య 22కి పెరిగింది. గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

వివరాలు 2లో..


## ప్రఖ్యాత ఎంసీజీలో మంత్రి నారా లోకేశ్...



- మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ విక్టోరియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీ, విక్టోరియా మధ్య ఉమ్మడి శిక్షణా శిబిరాలు, మ్యాచ్‌ల నిర్వహణపై చర్చ
- ఏడాది పొడవునా ఆదాయం తెచ్చే ఎంసీజీ రెవెన్యూ మోడల్‌పై ఆసక్తి
- అమరావతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణాన్ని వేగవంతం చేయడమే లక్ష్యం
- ఆంధ్రా క్రికెట్‌తో భాగస్వామ్యం, హై-పర్‌ఫార్మెన్స్ అకాడమీల ఏర్పాటుకు ప్రణాళిక
- క్రీడలు ఆర్థిక వ్యవస్థలను కూడా నడిపిస్తాయన్న మంత్రి నారా లోకేశ్

వివరాలు 2లో..

## బాలకృష్ణ బాడీ లాంగ్వేజ్ తెలిసి కూడా జగన్ అలా మాట్లాడడం పద్ధతి కాదు



- బాలకృష్ణపై జగన్ వ్యాఖ్యలను ఖండించిన మంత్రి పార్థసారథి
- అసెంబ్లీకి రాకుండా మాట్లాడటం సరికాదని హితవు
- జగన్ హయాంలో అదానీ డేటా సెంటర్ ఎందుకు రాలేదని ప్రశ్న
- నివాసయోగ్యం కాని సెంటు భూమి లేఅవుట్లు రద్దు చేస్తామని ప్రకటన

వివరాలు 2లో..

### స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన..

## తీవ్రంగా స్పందించిన జైశంకర్



- మైనార్టీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడాలన్న ఐరాస
- ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవన్న జైశంకర్
- ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మైనారిటీల రక్షణ, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులను కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి

వివరాలు 2లో..

### కర్నూల్ బస్సు ప్రమాదంపై షర్మిల దిగ్భ్రాంతి..

## ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని షర్మిల

వివరాలు 2లో..

- కర్నూల్ బస్సు ప్రమాద ఘటనపై స్పందించిన వైఎస్ షర్మిల
- ప్రమాదం తీవ్ర దిగ్భాంతికి గురి చేసిందన్న ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు
- సజీవదహనం కావడం అత్యంత విచారకరమని ఆవేదన

## నమ్మలేకపోతున్నాను...

### అబుదాబిలో హిందూ ఆలయాన్ని చూసి ముగ్ధుడైన సీఎం చంద్రబాబు



- యూఏఈ పర్యటనలో అబుదాబి బీఏపీఎస్ ఆలయాన్ని సందర్శించిన సీఎం చంద్రబాబు
- తన జీవితంలో ఇదొక అద్భుతమైన అనుభవమని వ్యాఖ్య
- ఆలయ శిల్పకళను చూసి 'నిజమైన అద్భుతం' అని ప్రశంస
- చరిత్రలో నిలిచిపోయే అద్భుతమని ఆలయ నిర్మాణంపై కితాబు
- ఆలయ నిర్మాణానికి యూఏఈ నాయకత్వం సహకారాన్ని కొనియాడిన సీఎం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుతం యూఏఈలో మూడు రోజుల పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా ఆయన అబుదాబిలోని బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారా యణ్ సంస్థ

వివరాలు 2లో..

### బంగాళాఖాతంలో మరో అల్పపీడనం...

## ఈ నెల 27 నాటికి తుపాను

- శనివారానికి వాయుగుండంగా మారే అవకాశం
- సోమవారం నాటికి మరరింత బలపడి తుపానుగా రూపాంతరం
- మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్డీఎంఏ సూచన
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని వెల్లడి

వివరాలు 2లో..



## సుంకాలపై ట్రంప్ బెదిరింపులు.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- భారతదేశం ఎవరికీ తలొగ్గదని, హడావుడి నిర్ణయాలు తీసుకోదన్న గోయల్
- అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి వ్యూహాత్మక విధానాలను అనుసరిస్తోందన్న కేంద్ర మంత్రి
- మరిన్ని సుంకాలు వేస్తామంటే కొత్త మార్కెట్లను వెతుక్కుంటామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:అమెరికా – భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సమయంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ ఎవరికీ తలొగ్గదని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోదని ఆయన స్పష్టం చేశారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్ అనేక వ్యూహాత్మక విధానాలను అనుసరిస్తోందని అన్నారు. కరోనా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# గూగుల్ డేటా సెంటర్.. వంద అనుమానాలు

గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ వైజాగ్‌లో ఎంటరవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచాన్నే తన గుప్పిట్లో పెట్టుకున్న గూగుల్.. ప్రపంచంలోనే అతిపెద్ద %ూ×% హబ్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తోంది. ఇంతవరకూ అమెరికాబయట గూగుల్ ఇంత భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయలేదు. ఏకంగా లక్షా 30వేల కోట్ల పెట్టుబడి వస్తున్నట్లు ప్రకటించింది. ఇంత పెద్ద సంస్థ అంత పెద్ద పెట్టుబడిని పెడుతుంటే.. అది రాష్ట్రానికి గర్వకారణంగానేఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టుపై సంబరం ఎంతుందో ఆందోళన కూడా అదే స్థాయిలో ఉంది. ఒక బిగ్ జెయింట్ వచ్చినప్పుడు.. ఎలాంటి ఎకోసిస్టమ్ వస్తుందన్న దానికి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఉదాహరణగా ఉంది.ఇప్పుడు అదే సిమిలారిటీ వైజాగ్‌లో కనిపిస్తోంది. కానీ మరి అలాంటి డవలప్‌మెంట్ ఇక్కడ వస్తుందా..? ప్రభుత్వం చెప్పే ఉద్యోగాలు రావు అని, పర్యావరణపరంగా సమస్యలు అని.. ఈ ప్రభుత్వం గూగుల్‌ను రప్పించడంకోసం ఉదారంగా చాలా తాయిలాలు ఇచ్చేసిందని.. ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నప్పుడు.. ప్రభుత్వం వైపు నుంచి దానిపై క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. గూగుల్ రాకపై అధికార ప్రకటన వచ్చింది, ఆతర్వాత సంబంధిత మంత్రి లోకేష్ మీడియా సమావేశంలో చాలా విషయాలు చెప్పారు. అయినా కానీ కొన్ని ప్రశ్నలు అలాగే మిగిలిపోయాయి. దీనిపై ప్రభుత్వం నుంచి మాత్రం క్లారిటీ రావడం లేదు. లక్ష కోట్లకు పైగాపెట్టుబడి అంటే.. ఆ స్థాయిలో ఉద్యోగాలు ఉండాలి కదా.. ప్రభుత్వం ఏకంగా 1.8లక్షల ఉద్యోగాలు వస్తాయంటోంది. దీనిపైనే ఎక్కువ సందేహాలున్నాయి. మామూలుగా ఓ డేటా సెంటర్‌లో 200 కు మించి శాశ్వతఉద్యోగాలు ఉండవని లెక్కలు చెబుతున్నాయి. పరోక్ష ఉద్యోగాలు ఓ 600 ఉంటాయి. అంటే మొత్తం 1000కి మించి వచ్చే అవకాశం లేదు. నిర్మాణ సమయంలో 20వేల మందికి తాత్కాలిక ఉద్యోగాలు ఉంటాయి. వైసీపీ ప్రభుత్వంలో అదానీ సెంటర్ 300 మెగావాట్లతో ఏర్పాటు చేస్తున్నప్పుడు.. 39వేల ఉద్యోగాలు వస్తాయని స్వయంగా అప్పటి సీఎం జగన్ చెప్పారు. ఇప్పుడు వస్తోంది.. దానికి 3రెట్లు ఉంది. అంటే లక్షా 20వేలఉద్యోగాలు రావాలి... డేటా సెంటర్‌తో పాటు.. ఐటీ పార్క్, స్కిల్ యూనివర్సిటీ కూడా ఉంది అందుకే అన్ని ఉద్యోగాలు చెప్పామంటోంది. అప్పటి ఐటీ మంత్రి గుడివాడ అమరనాథ్ ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తున్నారు. కానీఅన్ని ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రభుత్వం నుంచి అధికారికంగా క్లారిటీ ఇవ్వడం లేదు. డేటా సెంటర్ కాకుండా ఇంకేమైనా వస్తాయా..?డేటా సెంటర్ కోసం తుర్లవాడలో 200 ఎకరాలు, ఆనందపురం ముడసర్లోవలో100 ఎకరాలు, రాంబిల్లిలో 160 ఎకరాలు తీసుకున్నారు. ఈ మూడూ ఒకచోట లేవు. ఈ మూడు చోట్ల కలిపి క్లస్టర్ వస్తోందా.. లేదా వేరు వేరు ప్రాజెక్టులా.. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. పెద్ద ప్రాజెక్టు రావాలన్నాఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ జరగాలి.. ఈ ప్రాజెక్టు కోసం ఆ అసెస్‌మెంట్ జరిగిందా.. జరిగితే దాని ఇంపాక్ట్ ఏంటి.. అన్నది ఎక్కడా పబ్లిక్ డాక్యుమెంట్ లేదు. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావంఏంటన్నదానిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వడం లేదు. పర్యావరణ ప్రభావ అంచనా కోసం పబ్లిక్ హియరింగ్ జరపాలి. బహుశా దానిని ముందు ముందు నిర్వహిస్తారా లేక అన్ని అనుమతులు ఇచ్చేశారా... దీని గురించిచెప్పడం లేదు. ప్రాజెక్టుకు సంబంధించిన ఏ నివేదికలు బయట పెట్టడం లేదు కాబట్టి భూ కేటాయింపులు రద్దు చేయాలని హ్యూమన్ రైట్స్ ఫోరమ్ డిమాండ్ చేస్తోంది. గూగుల్ లాంటి భారీ ప్రాజెక్టును ఆకర్షించడానికిఇన్సెంటివ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. అందులో ఏం తప్పు లేదు. చాలా సందర్భాల్లో సంప్రదింపుల ద్వారా ఇది జరుగుతుంది. ఒక్కో సందర్భంలో ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తీసుకురావడానికి.. ఇతర రాష్ట్రాలతోపోటీని తట్టుకోవడానికి ఎక్కువగానే రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గూగుల్‌తో వస్తున్న లాభం కంటే.. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలే ఎక్కువ అని విమర్శలు వచ్చాయి. కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే.. ఏపీ ప్రభుత్వం 22వేల కోట్ల రాయితీలు ఇచ్చిందని.. చెప్పారు. ఏపీలో ఉన్న ఆర్థిక పరిస్థితికి అంత అవసరమా.. ఇది రైట్ ఇన్వెస్ట్‌మెంట్ కాదు అని ఆయన విమర్శించారు. గూగుల్‌కి ఏమిచ్చారు అన్నది స్పష్టంగా ఎక్కడాచెప్పలేదు. మనీ కంట్రోల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లోకేష్ మాత్రం భూమిని ఊరికే ఇవ్వలేదని మార్కెట్ ప్రైస్‌లో కొంత డిస్కౌంట్ ఇచ్చామని చెప్పారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం భూమి విలువలో25శాతం, కమర్షియల్ విద్యుత్‌లో యూనిట్‌కు ఒక రూపాయి... స్టేట్ జీఎస్టీ ఎస్జీఎస్టీలో పూర్తిగా మినహాయింపు, స్టాంప్ డ్యూటీ, ఎలక్ట్రిసిటీ డ్యూటీ మినహాయింపులు ఇఛ్చారని చెబుతున్నారు. దీని ద్వారా వచ్చే లాభంఇన్ సెంటివ్ లను మించి ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదు. మిగతా రాష్ట్రాల్లో ఈ స్థాయిలో రాయితీలు లేవని చెబుతున్నారు. ఇప్పుడు ప్రజల్లో ఆందోళనకు కారణమైన అంశం ఇది. ఇతర దేశాల్లో డేటాసెంటర్లపై వ్యతిరేకత ఉందని.. దీనికి భారీ ఎత్తున నీళ్లు అవసరం అవుతాయని.. వైజాగ్‌లో డేటా సెంటర్ చుట్టుపక్కల భూగర్భ జలాలు అడుగంటి పోతాయని.. అక్కడ భూములు కొనొద్దని చాలా ప్రచారాలుజరుగుతున్నాయి. ఈ ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోవాలి. ఈ డేటాసెంటర్‌కు ఎంత నీరు అవసరం అవుతుందన్న డాక్యుమెంట్ లేదు. అయితే ఓపెన్ %ూ×% సోర్సుల ద్వారా అంచనా కట్టింది ఏంటంటే.. గూగుల్‌డేటా సెంటర్‌కు ప్రతిరోజూ 11-19 మిలియన్ లీటర్ల నీరు అవసరం అని లెక్క గట్టారు. వైజాగ్ కు సరిపడా నీరు అవసరం అవుతుందా అని పరిశీలిస్తే.. అంత ఉండకపోవచ్చు. విశాఖపట్టణానికి ప్రతిరోజూ 400మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం అవుతోంది. ఏడాదికి 146 బిలియన్ లీటర్లు అవసరం.. డేటా సెంటర్‌కు ఏడాదికి 4-7 బిలియన్ లీటర్లు అవసరం. విశాఖ అవసరాల్లో 3-5% అవసరం అవుతుందని అర్థంఅవుతోంది. ఈ లెక్కల ప్రకారం ఏడాదికి 0.25%ఏజ% అవసరం. అయితే ఇది అధికారిక సమాచారం కాదు. ఇది గోదావరి నుంచి ఇస్తామని చెబుతున్నారు కానీ.. ఎంత అనే క్లారిటీ లేదు. ఇది మరో ముఖ్యమైనవిషయం. దీనిపై కూడా ప్రభుత్వం నుంచి ఎంత అవసరమో చెప్పలేదు. ఓపెన్ సోర్సులో ఉన్న సమాచారం ప్రకారం 1 %+ఔ% డేటా సెంటర్‌ను ఒక గంట నిర్వహించాలంటే.. గిగా వాట్ విద్యుత్ అవసరం. ఇది ఒకరోజుకు 24 మిలియన్ వాట్ అవర్ అవసరం అవుతుంది. వైజాగ్ సిటీ మొత్తం ఉపయోగించేది రోజులు 18 మిలియన్ వాట్ అవర్. అంటే వైజాగ్ వాడే విద్యుత్ కంటే.. 30శాతం ఎక్కువ. ఈ లెక్కలు కరెక్టు అనికాదు.. అందుబాటులో ఉన్న సమాచారం మాత్రమే. అయితే దీనిపై లోకేష్ ఓ క్లారిటీ ఇచ్చారు. దీని కోసం ప్రత్యేకంగా గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నామంటున్నారు. ఎంత విద్యుత్ అవసరమో చెప్పలేదు కానీ.. ఆ విద్యుత్‌మొత్తం రెన్యువల్ ఎనర్జీ.. అంటే సోలార్, విండ్, స్టోరేజ్ ద్వారా చేస్తామన్నారు. ప్రత్యేకమైన గ్రిడ్ ఏర్పాటుకు గూగుల్ పెట్టుబడి పెడుతుందని.. ఆ విద్యుత్‌లో తాము డిస్కౌంట్ ఇస్తామని లోకేష్ చెప్పారు. అయితే ఈ గ్రిడ్‌ద్వారా వచ్చే విద్యుత్ సరిపోతుందా.. పీక్ అవర్స్ లో సరిపోకపోతే.. థర్మల్ విద్యుత్ వాడాల్సి ఉంటుందన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై స్పష్టత లేదు, గూగుల్ విషయంలో మరో విమర్శ.. ఇది చాలా రహస్యంగాఉంచడం గురించి. పెట్టుబడులు కన్‌ఫామ్ అయ్యే వరకూ రహస్యంగా ఉంచడం అనేది వ్యూహాత్మక నిర్ణయమే. కానీ పారదర్శకతపై సందేహాలు వస్తున్నప్పుడు క్లారిటీ ఇవ్వాల్సి ఉంటుంది. గూగుల్ పెట్టుబడి పెట్టడానికిముందు రోజు కూడా ప్రభుత్వ అధికారిక ప్రెస్‌నోట్‌లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి అన్నారు. కానీ.. ఒప్పందం కుదిరిన తర్వాత.. అది 15 బిలియన్ డాలర్లు అని చెప్పారు. ఏకంగా 40వేల కోట్ల పెట్టుబడి పెరిగిపోయింది. ఒక్క రోజులో అంత పెరుగుదల ఎలా సాధ్యం అయింది.? గూగుల్‌తో పాటు.. అదానీ, ఎయిర్‌టెల్ చేరాయి. ఇదంతా ఎలా జరిగిందన్న విషయంలో పారదర్శకత లేదన్న వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఇవికాకుండా.. డేటా సెక్యూరిటీ.. డేటా సావరినీటి వంటి విషయాలపైనా చర్చ జరుగుతోంది. అయితే ఇండియాకు సంబంధించిన డేటా దేశం దాటి పోదని.. ఆ విషయంలో చట్టపరమైన రక్షణ ఉందని లోకేష్ చెప్పారు. కానీపైన చర్చించిన మిగిలిన విషయాలపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వడం లేదు.

## ప్రఖ్యాత ఎంసీజీలో మంత్రి నారా లోకేశ్...

ఆంధ్రప్రదేశ్‌లో క్రీడారంగ అభివృద్ధి, ముఖ్యంగా అమరావతిలో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ సిటీ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం చారిత్రాత్మక మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)ను సందర్శించి, క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశమయ్యారు. ఈ భేటీలో, ఆంధ్రప్రదేశ్, విక్టోరియా మధ్య క్రీడా సంబంధాలను బలోపేతం చేసే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఇరు ప్రాంతాల క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు ఉమ్మడి శిక్షణా శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ వారిని కోరారు. ఏపీలో క్రీడలకు ఉన్న ఆదరణ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఆయన వివరించారు. ఎంసీజీ కేవలం క్రికెట్ మ్యాచ్‌లకే పరిమితం కాకుండా, ఏడాది పొడవునా ఆదాయం ఆర్జించే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఈ సందర్భంగా లోకేశ్ తెలిపారు. మైదానంలో ఎలాంటి క్రీడా కార్యకలాపాలు లేనప్పుడు కూడా, ఇక్కడి కన్వెన్షన్, బాంకెట్ హాళ్లు నిత్యం కార్యక్రమాలతో నిండి ఉంటాయని తెలుసుకుని ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. ఈ స్టేడియం ద్వారానే విక్టోరియా ప్రభుత్వానికి పర్యాటకం, పన్నుల రూపంలో ఏటా 1.3 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల ఆదాయం వస్తోందని అధికారులు వివరించినట్లు పేర్కొన్నారు. క్రీడలు కేవలం యువతకు స్ఫూర్తినివ్వడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థలను కూడా బలోపేతం చేస్తాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఇదే తరహాలో అమరావతిలో స్పోర్ట్స్ సిటీని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందుకోసం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌తో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం, హై-పర్ఫార్మెన్స్ అకాడమీలను నెలకొల్పడం, స్పోర్ట్స్ సిటీ నిర్మాణాన్ని వేగవంతం చేయడమే తమ రోడ్‌మ్యాప్ అని ఆయన వివరించారు.

# బస్సు బుగ్గి

**మృత్యు ప్రయాణం ఇలా..**

-నేమూరి కావేరి ట్రావెల్స్ మెయిన్ ఆఫీస్ పటాన్చెరులో ఉంది. కూకట్పల్లిలో మరో కార్యాలయం ఉంది. ప్రమాదానికి గురైన వోల్వో బస్సు (డీడీ01ఎన్ 9490).. రాత్రి 9.30గం. పటాన్ చెరు నుంచి ప్రారంభమైంది. బీరంగూడ, గండి మైసమ్మ, బాచుపల్లి ఎక్స్ రోడ్, సూరారం, మియాపూర్, ఆల్విన్ ఎక్స్ రోడ్. వనస్థలి పురం పాయింట్లలో ప్రయాణికులను ఎక్కిం చుకొని బెంగళూరు వైపు బయల్దేరింది అర్ధరాత్రి 3.30గంటల ప్రాంతంలో కర్నూలు జిల్లా కలూరు మండలం చిన్నటేకూరు ఉల్లింద కొండ క్రాస్ వద్దకు చేరుకోగానే ఓ బైక్ను బస్సు ఢీకొట్టింది. బైకోను ఈడ్చుకెళ్లడంతో ఇంజిన్ వద్ద పైప్ పగిలి మంటలు చెలరేగి ఈ ఘోరం సంభవించింది. మంటలు చెలరేగాక.. ఎమర్జెన్సీ డోర్ తెరుచుకోలేదు. బస్సు ఆగడంతో కొందరికి మెలుకువ వచ్చి లేచి చూశారు.

**మంటలు చెలరేగడంతో..**

కాగా, బస్సు డ్రైవర్, సహాయకుడు, కొందరు ప్రయాణికులు ఎమర్జెన్సీ డోర్లు బద్దలు కొట్టుకుని బయటపడ్డారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న
నవీన్ తన కారులో గాయపడ్డ ఆరుగురిని ఆస్పత్రికి తరలించారు. హైమారెడ్డి అనే మరో మహిళ మంటలు చెలరేగడాన్ని చూసి అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు.

**డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే..**

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగిం దీని.. బైక్ ను ఢీ కొట్టినప్పుడే డ్రైవర్ బస్సును ఆపి ఉంటే ఇంతటి ఘోరం జరిగి ఉండేది కాదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. "మంటలు అంటుకోగానే అద్దాలు బద్దలు కొట్టి బయటకు దూకేశాం. అప్పటికే మా సోదరుడ్ కుటుంబం మంటల్లో చిక్కుకుంది. డ్రైవర్ నాళ్ల రక్షణ వాళ్లు చూసుకున్నారు. ప్రమాణీకులను పట్టించుకో
"లేదు" అని గాయపడ్డ ఓ ప్యాసింజర్ వాపోయారు. అలాగే.. ఘటన జరిగిన తర్వాత వాళ్ల రక్షణ చూసుకున్నారే తప్ప.. తమను అప్రమత్తం చేయలేదని, అది జరిగి ఉంటే అంతా క్షేమంగా బయటపడేవాళ్లని చికిత్స పొందుతున్న మరో ప్రయాణికుడు తెలిపాడు.

**బైకర్ కూడా సజీవ దహనం...**

ప్రమాదానికి కారణమైన బైక్ సైతం బస్సు కిందే కాలిన స్థితిలో ఉండిపోగా.. బైకర్ మృతదేహం రోడ్డు పక్కనే పడి ఉంది. అతని పేరు శివ శంకర్ గా గుర్తించారు కొడుకు మృతితో యశోదమ్మ బోరున విలపిస్తూ కనిపించింది.

**మృతుల సంఖ్య పెరగొచ్చు: డీఐజీ**

ఈ ఘటనపై కర్నూల్ రేంజ్ ఐజీ కోయ ప్రవీణ్ స్పందించారు. బస్సు మ్యానుఫ్యాక్చరింగ్ లోనే లోపాలున్నాయని ఆరోపించారు.
బస్సులు ప్రమాదాలకు గురైతే.. ప్రయాణికుల ప్రాణనష్టం తగ్గించేలా బస్సు నిర్మాణంలో మెటీరియల్ వాడటం లేదన్నారు. ప్రయాణి కులు ప్రాణాలతో బయటపడేలా బస్సు నిర్మాణంలో ప్రికాషన్స్ లేవన్నారు. బస్సుల ఫైర్ యాక్సిడెంట్ సేఫ్టీపై సమీక్ష జరగాలని, బస్సు నిర్మాణానికి ఎలాంటి మెటీరియల్ వాడాలన్న దానిపై కూడా అధ్యయనం చేయాలని ఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైన సమయంలో బస్సులో 39 మంది ప్రయాణి కులు. ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. వారిలో కొందరు మాత్రం అద్దాలు పగలగొ ట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారని, స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఏసీ స్లీపర్ బస్సు కావడంతో మంటలకు పొగ బస్సు మొత్తం అలుముకుని ప్రయాణికులకు ఊపిరాడని పరిస్థితి నెలకొందని వివరించారు. బస్సు డోర్ తెరుచుకోకపోవడం. బస్సులో నుంచి బయటికి వచ్చే దారి కూడా ఇరుకుగా ఉండటంతో చాలా మంది లోపలే ఉండిపోయి ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. బస్సు నిర్మాణానికి వాడిన మెటీరియల్ మంటల తీవ్రతను పెంచేలా ఉందన్నారు. ప్రమాద సమయంలో సిబ్బందితో కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. గాఢ నిద్రలో ఉండడంతో తేరుకునే లోపే ఘోరం జరిగిపోయింది. ఘటన నుంచి 23 మంది బయటపడ్డారు. ప్రమాద తీవ్రతను డ్రైవర్ అంచనా వేయలేదు. ఇప్పటిదాకా 19 మృతదేహాలను నెలికి తీశాం. చికిత్స పొందుతున్నవాళ్ల పరిస్థితి. విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య పెరగొచ్చు అని డీఐజీ కోయప్రవీణ్ అన్నారు.

# బస్సు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నాం

కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ భయంకర ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ప్రమాదంపై లోతైన దర్యాప్తు కోసం 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. శుక్రవారం కర్నూలులోని వ్యాస్ ఆడిటోరియంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి ప్రమాద వివరాలను వెల్లడించారు. ప్రమాద సమయంలో బస్సులో నలుగురు చిన్నారులు, 39 మంది పెద్దలు ఉన్నారని హోం మంత్రి తెలిపారు. 19 మంది చనిపోయారని వెల్లడించారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆరుగురు చొప్పున, కర్ణాటక, తమిళనాడు నుంచి ఇద్దరు చొప్పున, బీహార్, ఒడిశా నుంచి ఒక్కొక్కరు ఉన్నారని ఆమె వివరించారు. మరో మృతదేహాన్ని ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు. ప్రమాదంలో గాయపడిన తొమ్మిది మందికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**డీఎన్ఏ పరీక్షలతో మృతదేహాల గుర్తింపు**

ప్రమాద తీవ్రతకు మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయని హోం మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, మృతుల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. శాంపిల్స్ సేకరించి, కుటుంబ సభ్యుల డీఎన్ఏతో సరిపోల్చిన తర్వాతే మృతదేహాలను వారికి అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టవచ్చని, బాధితుల కుటుంబాలు సహకరించాలని కోరారు.

**అన్ని కోణాల్లో దర్యాప్తు**

ఈ దారుణ ఘటనపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, దర్యాప్తును ముమ్మరం చేశామని మంత్రి అనిత తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం ఆధారంగా కొన్ని కీలక అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను నిగ్గు తేల్చేందుకు 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు జరుగుతుందని ఆమె హామీ ఇచ్చారు. దర్యాప్తు నివేదిక వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందుతుందని పేర్కొన్నారు.

**బాధితులకు ప్రభుత్వ అండ**

అనంతరం, రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తక్షణ సహాయక చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదంలో మరణించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం
అందిస్తామని ప్రకటించారు. అలాగే, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ దుర్ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయి.

# కర్నూల్ బస్సు ప్రమాదంపై షర్మిల దిగ్భ్రాంతి..
# ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

- మొదటి పేజి తరువాయి

పేర్కొన్నారు. ప్రమాదంలో ప్రయాణికులు సజీవదహనం కావడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలను ముమ్మరం చేయాలని షర్మిల సూచించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి, మృతుల సంఖ్య పెరగకుండా చూడాలని కోరారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
కాగా, ఈ ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 19 మంది సురక్షితంగా ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో ఫోరెన్సిక్ నిపుణులు వాటిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

# సుంకాలపై ట్రంప్ బెదిరింపులు..
# పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

మహమ్మారి సమయంలో ప్రపంచ దేశాల మధ్య ఏర్పడిన అంతరాయాల నేపథ్యంలో, 2021లో భారతదేశ వాణిజ్య విధానంలో మార్పు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఒంటరిగా ఉండకూడదని, ఇతర దేశాలతో విశ్వసనీయ సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరుచుకుంటున్నామని తెలిపారు. దీని ద్వారా సాంకేతికత, పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్లు వంటి ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. భారత్ వాణిజ్య ఒప్పందాలకు
కట్టుబడి ఉంటుందని, కానీ ఒత్తిడితో మాత్రం చర్చలు జరపదని స్పష్టం చేశారు. ఇప్పటికే భారత్‌పై ఉన్న సుంకాలను అంగీకరిస్తున్నామని, అలాగని మరిన్ని సుంకాలు వేస్తామనే బెదిరింపు ధోరణిని అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. ప్రత్యామ్నాయ మార్గాలు, కొత్త మార్కెట్లను అన్వేషిస్తామని వ్యాఖ్యానించారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం... ఈ నెల 27 నాటికి తుపాను

ఆగ్నేయ బంగాళాఖాతంలో కొత్తగా మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది వేగంగా బలపడుతోందని, రానున్న 72 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం ఉదయం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ అల్పపీడనం, పశ్చిమ-వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతోంది. ఇది మరింత బలపడి అక్టోబర్ 25 (శనివారం) నాటికి వాయుగుండంగా, అక్టోబర్ 26 (ఆదివారం) నాటికి తీవ్ర వాయుగుండంగా మారనుందని ఐఎండీ తెలిపింది. అక్టోబర్ 27 (సోమవారం) ఉదయానికి నైరుతి, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఇది తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ తుపాను ప్రభావంపై ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (%ూూాణపీూ%) ఎండీ ప్రఖర్ జైన్ కీలక వివరాలు వెల్లడించారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఆదివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు, సోమవారం అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ప్రజలు ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని కోరారు.

## స్వేచ్ఛా హక్కులపై భారత్‌కు ఐక్యరాజ్య సమితి సూచన..
# తీవ్రంగా స్పందించిన జైశంకర్

- మొదటి పేజి తరువాయి

మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గట్టిగా స్పందించారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించలేవని స్పష్టం చేశారు. ఐరాస 80వ వార్షికోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపు విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వివాదాల యుగంలో శాంతి అవశ్యమని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఐక్యరాజ్య సమితిలో అంతా సరిగా లేదని అన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితిలో మార్పులు జరిగేలా సంస్కరణలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితికి భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని, అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. జాత్యాహంకారం, వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను స్విట్జర్లాండ్ ఎదుర్కొంటున్న సంగతిని ఆయన ప్రస్తావించారు.

# నమ్మలేకపోతున్నాను...
## అబుదాబిలో హిందూ ఆలయాన్ని చూసి ముగ్ధుడైన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

హిందూ మందిరాన్ని సందర్శించారు. ఆలయ సందర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇది తన జీవితంలో అత్యంత అద్భుతమైన అనుభవాలలో ఒకటి అని అభివర్ణించారు. ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్రహ్మవిహారిదాస్ స్వామి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయ విశిష్టతలను, అద్భుతమైన శిల్పకళను, ఆధునిక ఆవిష్కరణలను, ఐక్యత సందేశాన్ని ఆయనకు వివరించారు. ఆలయంలోని సుందరమైన, సున్నితమైన కళానైపుణ్యాన్ని చూసి ముగ్ధుడైన చంద్రబాబు, దీనిని "ఒక నిజమైన అద్భుతం" అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో తిరుపతిలోని శ్రీనివాస-పద్మావతి సన్నిధి వద్ద విగ్రహ నిర్మాణం పర్యవేక్షించిన ఒక దక్షిణాది వలంటీర్‌ను అబుదాబి ఆలయంలో కలిసి ఆయన సేవలను అభినందించారు. ఆలయ ప్రాంగణమంతా కలియదిరిగిన చంద్రబాబు, దాని నిర్మాణ శైలి, వైభవాన్ని చూసి ఎంతగానో ప్రశంసించారు. ఆలయాన్ని పూర్తిస్థాయిలో చూడటం ఇదే మొదటిసారని ఆయన తెలిపారు. యువతకు ఇలాంటి నిర్మాణాలు ఎంతో అవసరమని పేర్కొంటూ, "మన సంస్కృతీ విలువలను యువతకు అర్థమయ్యే రీతిలో చెప్పాలి. ఈ ఆలయం ఆ పని చేస్తోంది" అని ఆయన అన్నారు. చారిత్రకమైన ఈ సాంస్కృతిక సౌధం నిర్మాణానికి యూఏఈ నాయకత్వం అందించిన బలమైన మద్దతును కూడా ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా, దక్షిణాదికి చెందిన ఒక భక్తుడు ముఖ్యమంత్రితో మాట్లాడుతూ, "నేను వందకు పైగా సార్లు ఇక్కడికి వచ్చాను. ఇది కేవలం ప్రార్థనా స్థలం కాదు, ఇది నా ఇల్లు. మన మూలాలు, సంస్కృతి ఇక్కడ సజీవంగా ఉన్నాయనడానికి ఇదొక గుర్తు" అని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఆలయ సౌందర్యాన్ని చూసి అబ్బురపడిన చంద్రబాబు, "నా జీవితంలో ఎన్నో విజయగాథలు చూశాను. కానీ ఇది ఒక ప్రత్యేకమైన విజయం. కేవలం ఐదేళ్లలో మీరు చరిత్రలో నిలిచిపోయే, ఒక వారసత్వంగా మిగిలిపోయే అద్భుతాన్ని సాధించారు. ఇక్కడ నేను చూసింది నిజంగా నమ్మశక్యంగా లేదు" అని తన ముగింపు వ్యాఖ్యలలో పేర్కొన్నారు.

# బాలకృష్ణ బాడీ లాంగ్వేజ్ తెలిసి కూడా జగన్ అలా మాట్లాడడం పద్ధతి కాదు

వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా, సహచర శాసనసభ్యుడి గురించి ఇష్టానుసారంగా మాట్లాడటం జగన్‌కు తగదని హితవు పలికారు. శుక్రవారం నాడు సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. బాలకృష్ణ బాడీ లాంగ్వేజ్ గురించి, ఆయన ప్రవర్తన గురించి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, అలాంటి వ్యక్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఎలా చేస్తారని జగన్‌ను ప్రశ్నించారు. ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. అనంతరం విశాఖ డేటా సెంటర్ అంశాన్ని ప్రస్తావిస్తూ, జగన్ హయాంలో అదానీ డేటా సెంటర్ ఎందుకు ఏర్పాటు కాలేదని నిలదీశారు. ఆ సంస్థ ఏపీ నుంచి ఎందుకు వెనక్కి వెళ్లిపోయిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను పార్థసారథి వెల్లడించారు. గత ప్రభుత్వం పేదలకు కేటాయించిన సెంటు భూమి స్థలాలు చాలాచోట్ల నివాసయోగ్యంగా లేవని విమర్శించారు. ఈ నేపథ్యంలో, ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాని లేఅవుట్లను రద్దు చేసి, లబ్ధిదారులకు 2 నుంచి 3 సెంట్ల స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే నిర్మాణాలు మొదలుపెట్టి పూర్తికాని వారికి కూడా ఇదే తరహాలో కేటాయింపులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశంపై కూడా చర్చించామని, ఈ విషయంలో ఉన్న సమస్యలను అధిగమించి త్వరలోనే ముందుకు వెళతామని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

## బస్సు ఆక్సిడెంట్ పరిశీలన...

**కర్నూలు పెన్ పవర్ అక్టోబర్ 24 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి.కబర్ధి సూచనల మేరకు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం ఉలిందకొండ గ్రామం సమీపంలో జరిగిన బస్సు యాక్సిడెంట్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బస్సు యాక్సిడెంట్‌లో





గాయపడ్డ బాధితులనువారి బంధువులను పరామర్శించారు. వారికి ఏమైనా న్యాయం కావాలంటే కర్నూలు జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ వారికి ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు వారు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా గాని నేరుగా గాని జిల్లా న్యాయ సేవాది కార సంస్థ, కర్నూలును న్యాయ సహాయం కోసం ఎప్పుడైనా సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం సహాయ చర్యలపై పోలీసు అధికారులతో మరియు రెవెన్యూ అధికారుల మాట్లడారు.






కడప జిల్లా ఎస్పీ నిచికేత్ షెల్కె విశ్వనాథ్‌చే మనోబంధు పత్రిక ఆవిష్కరణ

## స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి నలుగురు విద్యార్థులు గల్లంతు

**తిరుపతి,పెన్ పవర్ అక్టోబర్ 24 :** తిరుపతి జిల్లా రూరల్ మండ లంలోని వేదాంతపురం సమీపంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం సాయంత్రం అగ్రహారం గ్రామానికి చెందిన 7 మంది యువకులు నదిలో ఈత కొడుతుండగా ప్రమాదం జరిగిందని, ఇసుక దిబ్బలపై ఆడుతూ స్నానం చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా పెరిగిన నీటి ప్రవాహానికి నలుగురు యువకులు కొట్టుకుపోయారని తెలిపారు. ముగ్గురు మాత్రం స్థానికుల సాయంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత శాఖలకు అప్రమత్తం అవ్వాలని, గల్లంతైన విద్యార్థుల కోసం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



**గల్లంతైన యువకులు :** ప్రకాశ్ (17), చిన్న (15), తేజు (19), బాలు (16)గా గుర్తించారని, రక్షణ సిబ్బంది గాలింపు చర్యలు ప్రారంభించగా, బాలు అనే యువకుడి మృతదేహం బయటపడింది. మిగిలిన ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోంది.జిల్లా పోలీసులు, రెవెన్యూ, ఫైర్, ఎన్డీఆర్ఎఫ్, బృందాలు, సిబ్బంది సంయుక్తంగా రక్షణ చర్యల్లో పాల్గొంటున్నారు. ఇటీవలి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున విద్యార్థులు మరియు యువకులు జాగ్రత్తగా ఉండాలని, ఇలాంటి ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారిని భద్రతతో ఉంచాలని సూచించారు.

## రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు

### మత్స్యకారులు రాబోయే మూడు రోజుల పాటు సముద్రంలోకి వెళ్ళరాదు : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్



తిరుపతి, పెన్ పవర్ అక్టోబర్ 24 : రానున్న ఐదు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తాజా వాతావరణ నివేదిక ప్రకారం, బంగాళాఖాతంలోని ఆగ్నేయ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో మరింత బలపడి స్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రానున్న ఐదు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ తీర ఆంధ్రప్రదేశ్ మరియు రాయలసీమ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాల ప్రభావం తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, గుంటూరు, బాపట్ల, కొణసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. వర్షాల సమయంలో నీట మునిగిన ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు మరియు చెరువులు, జలాశయాల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రానున్న అక్టోబర్ 27 నుండి 29 వరకు కొన్నిచోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలు అత్యవసరమైనపుడు తప్ప బయటకు వెళ్లవద్దని, వర్షాల సమయంలో పిల్లలను నీటి ప్రవాహాల దగ్గర ఆడనివ్వరాదని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 35%-%45 కిలోమీటర్ల వరకు, గాలివానల సమయంలో 55 కిలోమీటర్ల వరకు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఈ కారణంగా మత్స్యకారులు రాబోయే మూడు రోజులపాటు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. వర్షాల ప్రభావంతో రోడ్లు, విద్యుత్, తాగునీటి సరఫరా మరియు రవాణా వ్యవస్థల్లో అంతరాయాలు కలగవచ్చని, అందుకుగాను అన్ని శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, 24/7 అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ప్రమాద పరిస్థితులు గమనించినా తిరుపతి కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 0877-2236007 ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలందరూ వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తమ ప్రాంత అధికారులను సంప్రదించాలనీ, అవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలు మానుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విపత్తు సమయంలో తగిన విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి గంటకు నివేదికలు సమర్పించాలని, అప్రమత్తత చర్యలలో ఎటువంటి ఆలస్యం లేకుండా ప్రజల రక్షణ, ఆహారం, నీరు మరియు ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని, ఈ నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనితో పాటు రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీ సుబ్రమణ్యస్వామివారి హెూమం ప్రారంభం






**తిరుపతి పెన్ పవర్ అక్టోబర్ 24 :** తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీ సుబ్రమణ్య స్వామివారి హెూమం ప్రారంభమైంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజుల పాటు ఏకాంతంగా హెూమ మహెూత్సవాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ రోజు నుండి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు సుబ్రమణ్యస్వామి వారి హెూమం జరుగనుంది.

ఇందులో భాగంగా యాగశాలలో శుక్రవారంఉదయం పూజ, హెూమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు.సాయంత్రం హెూమం, సహస్రనామార్చన, విశేష దీపారాధన నిర్వహించనున్నారు.

కాగా ఈ నెల 27వ తేదీ శ్రీ దక్షిణ మూర్తి స్వామి వారి హెూమం జరుగనుంది. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామివారి దివ్యకల్యాణ మహెూత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.





తిరుమలలో జలకళ సంతరించుకున్న జలాశయాలు

## రోడ్డు భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలి

**– జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం, పెన్ పవర్ అక్టోబర్ 24 :** జిల్లాలో రోడ్డు భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ కి ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్ స్థలాలను గుర్తించాలని, నగరపాలక సంస్థ, ట్రాఫిక్ అధికారులు జాయింట్ తనిఖీ చేసి ప్రైవేట్ భూములను కూడా గుర్తించాలన్నారు. గుత్తి - గుంతకల్లు రోడ్ లోని రోడ్ మరియు ఆర్ఓబిని, రాప్తాడు వద్ద రైల్వేలైన్ ఉన్న బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బస్సులను ఆపేందుకు గుర్తించిన స్థలాల్లోనే మార్కింగ్ వేసి అక్కడే బస్సులు నిలిపేలా మున్సిపల్ కమిషనర్ తో సమన్వయం చేసుకొని ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.



ఎన్ఐసి వారు అభివృద్ధి చేసిన ఐరాడ్ యాప్ లో సిహెచ్సి మరియు ఏరియా ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రులలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారి వివరాలను డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు 100 శాతం డేటా ఎంట్రీ చేయాలని, పెండింగ్ ఉండడానికి వీలులేదని, డేటా ఎంట్రీకి సంబంధించి సంబంధిత సిబ్బందికి నిత్యం శిక్షణ నిర్వహించాలన్నారు. జిజిహెచ్ సూపరింటెండెంట్, డిసిహెచ్ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్‌లు వారి పరిధిలోని ఆసుపత్రులలో ఎన్ఐసి వారితో సమన్వయం చేసుకుని ఐరాడ్ యాప్ లో డేటా ఎంట్రీ నమోదు చేయించాలన్నారు. నగరంలోని తపోవనం బైపాస్ వద్ద జాతీయ రహదారిలో స్ట్రీట్ లైట్లను టౌన్ డీఎస్పీతో సమన్వయం చేసుకొని నేషనల్ హైవే వారు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుల్ ప్రాణాలు చాలా ముఖ్యమని, వారి ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, డిటిసి వీర్రాజు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఈఈ షాకిర్, పిఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, ఆర్.అండ్.బి ఈఈలు రాజగోపాల్, ప్రసాద్ రెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, డిసిహెచ్ఎస్ నవీన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వ్యవస్థలో సంస్కరణలు, గృహనిర్మాణంపై మంత్రుల బృందం సమీక్ష



**అనంతపురము,పెన్ పవర్ అక్టోబర్ 24 :** వ్యవస్థలో సంస్కరణలు, హౌసింగ్ పై నియమించబడిన మంత్రుల బృందం (జీవోఎం) రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఆం.ప్ర రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి ఫరూక్, సంబంధిత శాఖల కార్యదర్శులు విజయవాడ నుండి భేటీ అయి రెవెన్యూ వ్యవస్థ, హౌసింగ్ ఏపీ, వక్ఫ్ సంబంధిత సమస్యలపై, దేవాదాయ శాఖ సంబంధిత సర్వీస్ ఈనాం భూములు, ప్రభుత్వ స్థలాల అలియనేషన్, కేటాయింపుల పాలసీ తదితర అంశాలపై సంస్కరణల కొరకు చర్చించగా.. అనంతపురము జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ఐసీ భవనం వీసీ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రణాళిక, ఆర్థిక, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ గారు పాల్గొని సంబంధిత అంశంపై కూలంకషంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఆయా అంశాలపై సంస్కరణలు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పలు సూచనలు అందజేశారు.

## ధర్మవరం ప్రజల సమస్యలపై రైల్వే అధికారులతో హరీష్ బాబు చర్చ





**ధర్మవరం, పెన్ పవర్ అక్టోబర్ 24 :** ధర్మవరం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం రైల్వే శాఖ ఆధ్వర్యంలో రైల్వే సంవాద్ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక ప్రజలతో పాటు రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు, మంత్రి సత్య కుమార్ యాదవ్ తరపున ప్రజల తరపున పలు ముఖ్యమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. హరీష్ బాబు మాట్లాడుతూ ు గత కొన్ని సంవత్సరాలుగా గాంధీనగర్, శాంతినగర్, గుట్టకిందపల్లి, ఎల్-3, ఎల్-4 కాలనీల పరిసర ప్రాంతాల్లో అండర్ బ్రిడ్జలలో వర్షాకాలంలో నీటి నిల్వ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు. అదేవిధంగా ఎల్-3, ఎల్-4 కాలనీలకు బ్రిడ్జ్ యాక్సెస్ నిర్మాణం, స్టేషన్ పరిధిలో కోచ్ మోడల్ రెస్టారెంట్, షాపింగ్ కాంప్లెక్స్, అలాగే 5వ ప్లాట్‌ఫారమ్ వద్ద టికెట్ బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. హరీష్ బాబు ప్రతిపాదనలకు ప్రతిస్పందిస్తూ, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కోఆర్డినేషన్) శ్రీనివాస్ మాట్లాడుతూ నవంబర్ నెలాఖరుకల్లా అండర్ బ్రిడ్జలలో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తాం.

అవసరమైన సాంకేతిక చర్యలు ఇప్పటికే ప్రారంభించాం అని హామీ ఇచ్చారు. స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో అధికారులు అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సదుపాయాల విస్తరణ, అప్రోచ్ రోడ్ల మెరుగుదల, ఆర్చ్ నిర్మాణం వంటి అంశాలపై సమగ్ర వివరాలు అందించారు. అధికారులు ప్రజల సూచనలను స్వీకరించి, ధర్మవరం రైల్వే స్టేషన్ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వడానికి రైల్వే శాఖ కట్టుబడి ఉందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ నరసింహనాయుడు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గోనుగుంట్ల సూర్యనారాయణ, రిటైర్డ్ కమర్షియల్ సూపరింటెండెంట్ మనోహర్ గుప్తా, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, డాక్టర్ నరసింహులు, డి.ఆర్.యు.సి.సి. ఎక్స్ మెంబర్ బండి రాము, కమర్షియల్ సూపర్వైజర్ ముద్దన్న, ఎలక్ట్రికల్ ఇంజనీర్ కిరణ్ కుమార్, చీఫ్ ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కడప నగరంలోని "మన కడప-స్వచ్ఛ కడప"






**కడప పెన్ పవర్ అక్టోబర్ 24 :** కడప నగరంలోని మన కడప స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా, ఐటిసి కంపెనీ ఆధ్వర్యంలో కడప నగరాన్ని స్వచ్ఛ కడప గా తీర్చిదిద్దే భాగంలో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పాల్గొని, వాలంటీర్లకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. ప్రజా భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి వ స్వచ్ఛత సాధ్యమవుతాయని, ఐటిసి వంటిసంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. స్వచ్ఛత పట్ల ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తే కడప మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఆదర్శ నగరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి కంపెనీ ప్రతినిధులు, కడప మున్సిపల్ కమిషనర్, పాలకొండరాయ స్వామి ఆలయ చైర్మన్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాలపై సమీక్ష



**తిరుపతి పెన్ పవర్ అక్టోబర్ 24 :** తిరుపతి రవాణా శాఖ అధికారి కార్యాలయంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై 565 కేసులు నమోదు చేసి రూపాయలు 42, 95,331 అపరాధ రుసుము మరియు పన్నుల రూపంలో వసూలు చేయడం జరిగింది. పన్ను చెల్లించని వాహనాలపై పర్మిట్ లేకుండా , సరుకు రవాణా చేస్తున్న వాహనాలపై ఎక్కువ కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. అధికారుల్ని సందర్భంగా నిర్దేశిస్తూ వాహన తనిఖీల్లో భాగంగా మరింత జాగ్రత్తగా అగ్నిమాపక నియంత్రణ పరికరము మరియు అత్యవసర ద్వారము మోటార్ వాహనాల నియమ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో తనిఖీ నిర్వహించాలని చెప్పారు. ప్రయాణికులు వేగంగా వాహనం నడుస్తున్న డ్రైవర్ల పట్ల మరియు మద్యం సేవించి వాహనం నడుపుతున్న డ్రైవర్ల వ్యవహార శైలిపై అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారిపై తక్షణమే రవాణా శాఖ అధికారులకు మరియు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా మోటార్ వాహన తనిఖీ అధికారులు వనం వెంకట సుబ్రహ్మణ్యం, దామోదర్ నాయుడు, మోహన్ కుమార్ ఆంజనేయ ప్రసాద్, వెంకటరమణ నాయక్ మరియు స్వర్ణలత పాల్గొన్నారు.

# ప్రపంచ పోలియో దినోత్సవం-2025



**అనంతపురం పెన్ పవర్ అక్టోబర్ 24 :** ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న జరుపుకునే ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ప్రజలందరికీ తమ శుభాకాంక్షలను తెలియజేస్తూ, మన జిల్లా మరియు దేశం పోలియో రహితంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పాల్గొనాలని కోరుతోంది. భారతదేశం 2014 సంవత్సరంలో పోలియో రహిత దేశంగా ప్రకటించబడింది. ఇది ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు మరియు ప్రజల సహకారంతో సాధ్యమైంది. అయినప్పటికీ, ప్రపంచంలోని కొన్ని దేశాలలో ఇంకా పోలియో వ్యాధి ఉన్నందున జాగ్రత్త మరియు పూర్తి టీకా రక్షణ అవసరం. ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి ప్రతి జాతీయ మరియు ఉపజాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సమయంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. ఇప్పటికే టీకాలు వేసుకున్న పిల్లలకు కూడా ఈ చుక్కలు అదనపు రక్షణను అందిస్తాయి. ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘాలు మరియు స్వచ్ఛంద సంస్థలు అందరూ కలిసి పల్స్ పోలియో కార్యక్రమం మరియు రోటిన్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, తమ పరిధిలోని ప్రతి చిన్నారి టీకా రక్షణ పొందేలా కృషి చేయాలి. మన అందరి కృషితోనే "పోలియో రహిత అనంతపురం-పోలియో రహిత భారతదేశం" సాధ్యం అవుతుంది.

పౌల్ట్రీ రంగం సంబంధించిన

# రైతులు మంచి లాభాలు పొందాలి

**పశుసంవర్ధక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పౌల్ట్రీ రంగంలోని రైతులకు మంచి సలహాలు అందించాలి : జిల్లా కలెక్టర్**



**చిత్తూరు, పెన్ పవర్ అక్టోబర్ 24 :** రైతుల శ్రమను గుర్తించి పౌల్ట్రీ పరిశ్రమలు ధరలను అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంల సమావేశం మందిరంలో, జిల్లాలోని పౌల్ట్రీ రంగం రైతులతో, పౌల్ట్రీ రంగం కంపెనీ ప్రతినిధులతో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి ఉమామహేశ్వరి, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పౌల్ట్రీ రంగం రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని ధరలను అందించాలన్నారు. పౌల్ట్రీ రంగం ద్వారా బాయిలర్ కోళ్ల ఇచ్చే దాన, మందులు, ఇతర సౌకర్యాలు ఎలా అందుతున్నాయో పశు సంవర్ధక శాఖ అధికారులు ఆధ్వర్యంలో టీములుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి పౌల్ట్రీ రంగం రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని ఆదేశించారుపాడి రైతులకు మేలు కలిగేలా ఇతర రాష్ట్రాల నుండి అమూల్, శ్రీజ, మదర్ డైయిరీ లాంటి డైయిరీ పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు అయ్యాయని, వీటి ద్వారాపోటీమరింతపెరిగిందన్నారు. కొద్దిపాటి ఉత్పత్తితో ప్రారంభించిన అమూల్ డైయిరీ నేడు 1.2 లక్షల లీటర్ల వరకు పాలను సేకరిస్తున్నదన్నారు. పాల సేకరణలో పోటీ పెరగడంతో రైతులకు ప్రోత్సాహక ధరలనుఅందిస్తున్నారన్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న డైయిరీలు కూడా పోటీలను తట్టుకుని నిలవాలంటే రైతులకు ప్రోత్సాహకంగా ధరలను అందించాలన్నారు. ధరల విషయంలో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోదని, మెరుగైన ధరలు చెల్లించే పరిశ్రమలకు ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్నారు. గతంలో మామిడి రైతులకు అండగా నిలిచిన మామిడిగుజ్జు పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. గత 6 నుండి 7 నెలల కాలంగా మామిడి గుజ్జు పరిశ్రమల వ్యవహార శైలిని పరిశీలిచామన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మార్కెట్ ధరలను, పరిశ్రమలు రైతులకు అందిస్తున్న ధరల వ్యత్యాసన్ని నిశితంగా గమనించాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల పై ఆధారపడిన పరిశ్రమలు, పౌల్ట్రీ రైతులకు అండగా నిలిస్తే త్వరగా వృద్ధిలోకి వస్తుందని తెలిపారు. ఈ సమావేశం లో పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ ఎండి అబ్దుల్ ఆసిఫ్, డాక్టర్ విజయ మోహన్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఆసిఫ్ , జిల్లాలోని పౌల్ట్రీ హచ్చరీస్ అయిన ప్రీమిమియం, స్నేహ, బజాజీ, ఎస్. ఆర్ మరియు ఇతర పౌల్ట్రీ హచ్చరీస్ తరపున వారి ప్రతినిధులు , యాదమర్రి, బంగారుపాళ్యం, పలమనేరు, చిత్తూరు, ఐరాల, పూతలపట్టు మండలాలకు సంబంధించిన రైతులుతదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలి

**– జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**





**అనంతపురం, పెన్ పవర్ అక్టోబర్ 24 :** డ్రగ్స్ మరియు గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ చర్యలు-అవగాహన కార్యక్రమాల సమీక్షకు సంబంధించి ఎన్కొఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్,) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సామాజిక సంక్షేమ శాఖ (ఎన్ఎంబిఏ), డిఎంహెచ్ఓ, జిజిహెచ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ శాఖ, డిఈఓ, ఆర్ఐఓ, మరియు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ విభాగం అందరూ కలిసి విద్యార్థులు మరియు ప్రజలలో ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972, క్యూర్ కోడ్ గురించి, డ్రగ్స్, గంజాయి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డీ-అడిక్షన్ సెంటర్ మరియు ప్రిజన్ వార్డ్ లను బలంగా ఏర్పాటు చేయాలని, డ్రగ్ వ్యసన బాధితుల పునరావాసానికి సమర్థవంతంగా పనిచేయాలని డిఎంహెచ్ఓ మరియు జిజిహెచ్ సూపరింటెండెంట్ లను ఆదేశించారు. మున్సిపల్ మరియు పంచాయతీ అధికారులు తమ పరిధిలోని విడిచి పెట్టబడిన మరియు అనుమానాస్పద ప్రదేశాలను పర్యవేక్షించాలి, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలు జరగకుండా చూడాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ నిధులను (ఎన్ఎంబిఏ) డ్రగ్స్ మరియు గంజాయి అవగాహన కార్యక్రమాల కోసం సక్రమంగా మరియు పారదర్శకంగా ఉపయోగించాలని వికలాంగుల సంక్షేమ శాఖ ఎడిని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణలో జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. వాహనాల తనిఖీలను మరింత బలోపేతం చేసి, డ్రగ్స్ మరియు గంజాయి రవాణాను నిరోధించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిటిసిని ఆదేశించారు. డిఎంహెచ్ఓ తమ పరిధిలోని పిహెచ్సిలు, ఆశా వర్కర్లు మరియు ఏఎన్ఎంల ద్వారా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 మరియు క్యూఆర్ కోడ్ విస్తృత ప్రచారం కల్పించాలని, గ్రామీణ స్థాయిలో ప్రజల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన పెంపొందించాలన్నారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాలని, డ్రగ్స్ మరియు గంజాయి సమస్యను అరికట్టడంలో ప్రభుత్వ-ప్రజా భాగస్వామ్యం అత్యంత అవసరమని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు కేశవ నాయుడు, వసంత బాబు, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, డిటిసి వీర్రాజు, పిడి నేషనల్ హైవే తరుణ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామమోహన్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, డివిఈవో వెంకటరమణ నాయక్, డిఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డీఈవో ప్రసాద్ బాబు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఎఫ్ఆర్ఓ శివరాం, జిజిహెచ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, జిల్లా సిరికల్చర్ అధికారి విజయకుమార్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై మరో 2 రోజులు అప్రమత్తంగా ఉండాలి

**– అధికారులు సిబ్బందికి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం – మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ సిబ్బంది, హెల్త్ ఆఫీసర్లతో సమీక్ష**



**అనంతపురం, పెన్ పవర్ అక్టోబరు 24 :** మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. నగరంలో గత రెండు రోజులు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆర్.అండ్.బి గెస్ట్ హౌస్ నందు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, ఇంజనీరింగ్ సిబ్బంది, హెల్త్ ఆఫీసర్లు ఈ సమీక్షలో పాల్గొని.. వర్షాలపై తీసుకుంటున్న చర్యల్ని వివరించారు. గురువారం రాత్రి వర్షం కురిసిన సమయంలో అధికారులు, పోలీసులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాగా స్పందించారన్నారు. అర్ధరాత్రి వేళలో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా కాల్వల వద్ద చర్యలు చేపట్టారన్నారు. అయితే వర్షాలు ఇంకా ఎక్కువగా ఉన్నాయని అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. ప్రజలకు తగిన సూచనలు చేయాలన్నారు.

నడిమి వంక, మరువ వంక, నగర శివారు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎక్కడైనా పూడిక ఎక్కువగా ఉన్నా.. ప్రవాహానికి అడ్డంకులు ఉన్నా అక్కడ పనులు చేపట్టాలన్నారు. నగరంలో వంకల చుట్టూ ఆక్రమణలు ఉన్నాయని.. దాని వలనే ముంపు సమస్య వస్తోందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పూర్తి స్వేచ్ఛనిచ్చినా ఎందుకు స్పందించలేదన్నారు. ప్రస్తుతం ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలతో వాటిని పట్టించుకోకుండా ఉండొద్దని భవిష్యత్ లో వచ్చే పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది, కార్మికులు 24×7 అందుబాటులో ఉండాలన్నారు. శానిటేషన్ పై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని.. దీనిపై ఎన్నిసార్లు చెప్పిన తీరు మారడం లేదన్నారు. ఇలా ఉంటే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# మైనార్టీ యువతకు " జర్మనీ"లో ఉద్యోగ అవకాశాలు

**– ఎలక్ట్రిషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం – నవంబర్ 2 తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం**

**– నెలకు రూ.2.60 లక్షలుపైబడి జీతం – రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**



**అమరావతి పెన్ పవర్ అక్టోబరు 24 :** రాష్ట్రంలోని మైనారిటీ యువతకు జర్మనీ దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కూటమి ప్రభుత్వం నేతృత్వంలో కల్పిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీ ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీ ఎస్ ఎస్డిసి), ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (ఓఎంసిఏపి), ఐఈఎస్ల సహకారంతో, జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.రెండు సంవత్సరాల ఐటిఐ లేదా మూడు సంవత్సరాల ఎలక్ట్రిషియన్ ట్రేడ్ విద్యార్హతతో ఉత్తీర్ణత సాధించిన వారు జర్మనీ ఉద్యోగాలకు అర్హులన్నారు.వయో పరిమితి గరిష్టంగా 30 సంవత్సరాలు లోపు ఉన్నవారు,కనీసం రెండేళ్ల సంబంధిత ఎలక్ట్రిషియన్ పనులలో అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**నెలకు 2.60 లక్షలు పైబడిన జీతంతో ఉద్యోగాలు**

జర్మనీ దేశంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి భారీగా జీతం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. నెలకు 2,600 నుండి 2,700 యూరోలు ( భారత కరెన్సీలో రూ. 2.60 లక్షల నుండి రూ.2.70 లక్షలు) జీతం పొందవచ్చునని అన్నారు. రెండేళ్ల ఒప్పందం మేరకు జర్మనీలో ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు ఉందని తెలిపారు.ఒప్పందం ప్రకారం అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు.జర్మనీలో అవసరమయ్యే అక్కడి స్థానిక గుర్తింపు, అనువాద ఖర్చులను యజమాని భరిస్తారని, వసతి,రాక (ఆరైవల్) సహాయంను అక్కడ యజమాని అందిస్తారని తెలిపారు.జర్మనీలో 6 నెలల ప్రొబేషన్ కాలం పూర్తయిన తర్వాత 1000 యూరోలు తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు.

**నవంబర్ నుండి జర్మనీ భాష పై శిక్షణ**

జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులకు జర్మనీ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు మంత్రి ఫరూక్ తెలిపారు. దాదాపు 12 లేదా 14 వారాల పాటు జర్మన్ భాష లోని ఏ-1,ఏ-2 స్థాయిల వరకు క్లాస్ రూమ్ శిక్షణ ను తాత్కాలికంగా రాజమండ్రిలో ఏర్పాటు చేసి రోజుకి 8 గంటలపాటు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు ఖర్చును అభ్యర్థులే భరాయించాల్సి ఉంటుందని వెల్లడించారు.దరఖాస్తు, శిక్షణ కోసం ఫీజు రూ.1.15 లక్షలు ను మూడు వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.విమాన,వీసా తదితర ఛార్జీలు కూడా అభ్యర్థు లు స్వయంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. జర్మనీలో ఉద్యోగాల కోసం నవంబర్ 2వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. చెల్లుబాటు అయ్యే పాస్ పోర్టు, గతంలో పనిచేసిన కంపెనీల నుండి రిలీవింగ్ లెటర్,సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మైనారిటీ అభ్యర్థులందరూ వారి యొక్క బయోడేటా స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీ ఎస్ ఎస్ డి సి. ఇన్ కు ఆన్లైన్ ద్వారా పంపించాలని మంత్రి కోరారు. మరిన్ని వివరాల కోసం, ఆసక్తి గల అభ్యర్థులు 9988853335, 8712655686, 8790118349, 8790117279 సెల్ నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని, అర్హులైన మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# నేను కష్టపడతా... మీరు కష్టపడండి : వైవియూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



**కడప పెన్ పవర్ అక్టోబర్ 24 :** విశ్వవిద్యాలయ పరిపాలనలో నేను కష్టపడతాను మీరు కూడా నా వెంట నడవండి విశ్వవిద్యాలయం పట్ల సమాజంలో మంచి పేరు నిలపాలన్నదే మనందరి ప్రధమ కర్తవ్యం కావాలని వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన బోధ నేతర సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పరిపాలనా పరంగా ఎదురవుతున్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సూచనలు చేస్తూ ఫైల్ క్లియరెన్స్ వెనువెంటనే జరగాలని, ఎక్కడ జాప్యానికి తావు ఇవ్వకూడదన్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ ఆఫీస్ ( పేపర్ లెస్ ) నిర్వహణ కచ్చితంగా అమలు కావాలని ఆదేశాలిచ్చారు. మరిన్ని విలువైన సూచనలు చేశారు. సమావేశంలో ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ఎస్టాబ్లిష్మెంట్ విభాగ అసిస్టెంట్ రిజిస్ట్రర్లు సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ట్స్ బ్లాక్ పరిశీలన.. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆర్ట్స్ బ్లాక్ విభాగాన్ని ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ సందర్శించారు. రెండవ అంతస్తులో విద్యార్థుల అవసరాలకు తగ్గ నిర్మాణాలు చేపట్టాలని, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులతో చర్చిచారు. కంప్యూటర్ ల్యాబ్లో విద్యార్థులతో సాంకేతికపరమైన అంశాలపై కాసేపు మాట్లాడారు. విసి వెంట ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. - డాక్టర్ పి సరిత, డైరెక్టర్ ప్రజా సంబంధాల విభాగం, యోగివేమన యూనివర్సిటీ, కడప.



స్వచ్ఛమైన ఓటర్ల జాబితా

# రూపకల్పనకు సహకరించండి

**– జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్**



**నంద్యాల,పెన్ పవర్ అక్టోబర్ 24 :** స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని డిఆర్ఓ ఛాంబర్ నందు ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ మాట్లాడుతూ.... జిల్లాలో స్వచ్ఛమైన తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లు, మార్పులు, చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలని డిఆర్ఓ రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒక పోలింగ్ స్టేషన్లో 12 వందల ఓటర్లు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ బూతు నందు మరొక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి అందిన 6, 7, 8 ఫామ్స్ పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని ఎన్నికల విభాగం అధికారులకు తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామని డిఆర్ఓ రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కడపలో వివిధ హొటల్లు పరిశీలించిన ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత








**కడప పెన్ పవర్ అక్టోబర్ 24 :** కడప నగరంలో వివిధ హొటళ్లపై విస్తృత పరిశీలన చేసి వివిధ రకాల ఆహార పదార్థాలను శాంపిల్స్ను ల్యాబ్ పంపించడం జరిగినది. వంట మాస్టర్ లకు, హొటల్ యజమానులకు, శుభ్రత, ఆహార నాణ్యతలపై తగు సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో తమ సిబ్బందితో నగరంలో హొటల్లు, మున్సిపల్ హైస్కూల్ గాంధీనగర్ పాఠశాల ఆహార పదార్థాలను పరిశీలించడం జరిగినది.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా వచ్చిన కర్నూలు జిల్లా జైల్ల శాఖ అధికారి



**కర్నూలు పెన్ పవర్ అక్టోబర్ 24 :** నూతనంగా వచ్చిన కర్నూలు జిల్లా శాఖ అధికారి జి. రామకృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛమిచ్చి కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గార్లను జిల్లా కోర్టు నందు కలిశారు.




## Knowledge is Light - A Means To Aim - కాంతి యే జ్ఞానం, గమ్యానికి చేర్చే ఒక సాధనం

"జ్ఞానాన్ని కాంతి అనడంలో ఏ సందేహమూ లేదు. కాని అదే గమ్యం కాదు, అది కేవలం గమ్యానికి చేర్చే ఒక సాధనం. రాత్రి సమయంలో మనం దీపాన్ని దీపం కొరకై వెలిగించము, దాని కాంతిలో మనం కొంత పని చేసుకుంటాం. అదే దాని అంత్యము లేదా లక్ష్యము.

------ లాలాజీ

## కడప నగరంలో కమిషనర్ : ఎన్.మనోజ్ రెడ్డి



**కడప పెన్ పవర్ అక్టోబర్ 23 :** కడప నగరపాలక సంస్థ కమీషనర్ ఎన్. మనోజ్ రెడ్డి ఈ రోజు నిర్వహించిన మార్నింగ్ విజిట్ లో భాగంగా ఈస్ట్ జోన్ నందు సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కమీషనర్ అప్సర సర్కిల్ నందు సందర్శించారు. రోడ్ మీద వర్షపు నీరు నిలవకుండా ఉండటానికి శాశ్వత పరిస్కారం చేయాలని సంబంధిత అధికారులకి ఆదేశాలు జారీ చేసారు. వర్షాలు ఉన్నందున రోడ్ మీద నీటి నిల్వ ఉండకుండా ప్రజలకి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులకి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమీషనర్ గారు మునిసిపల్ మెయిన్ హై స్కూల్ నందు ఉన్న స్మార్ట్ కిచెన్‌ని సందర్శించారు, తరువాత పాత బస్టాండ్ నందు ఉన్న అన్నా క్యాంటిన్‌ని సందర్శించి లోపల అంత శుభ్రంగా ఉండేలాగా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు.

## అబ్జర్వేషన్ హెూమ్ ఫర్ బాయ్స్, కర్నూలును ఆకస్మికంగా తనిఖీ చేసిన కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి





**కర్నూలు పెన్ పవర్ అక్టోబర్ 24 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శ్రీ జి. కబర్ధి సూచనాల మేరకు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఈ రోజు అనగా 24-10-2025 న కర్నూలు నందు గల అబ్జర్వేషన్ హెూమ్ ఫర్ బాయ్స్ ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి పిల్లలకు అందిస్తున్న ఆహారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పిల్లలకు ఎవరికైనా న్యాయ వాది లేకుంటే ఉచిత న్యాయ వాదిని నియమించి వారి కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆ కాంపౌండ్ లోనే గల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీకార్యాలయం సందర్శించి రిజిస్టర్లను పరిశీలిం చారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చట్టంతో వివేదించబడిన బాలలకు సంబందించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయ మును గురించి తెలియజేశారు. పిల్లలు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. ఈ కార్య క్రమంలో అబ్జర్వేషన్ హెూమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ బాష, సిడబ్ల్యూసీ చైర్మన్ జుబేదాబేగం, జూవే నైల్ జస్టిస్ బోర్డు చైర్మన్ అపర్ణ, మెంబెర్స్ సునీత మాధవి ఆయా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ



**కడప పెన్ పవర్ అక్టోబర్ 24 :** కర్నూల్ లో జరిగిన బస్సు దుర్ఘటనపై రెండు నిమిషాలు మౌనం పాటించిన నాయకులు.. కడప నగరంలోని మాజీ డిప్యూటీ సీఎం గారి క్యాంప్ కార్యాలయం నందు ప్రజా ఉద్యమం ర్యాలీ పోస్టర్ మరియు పోస్టర్ ఆవిష్కరణ మరియు విలేకరుల సమావేశం నిర్వహించిన మాజీ డిప్యూటీ సీఎం శ్రీ ఎస్ బి అంజాద్ భాష గారు, ఇన్చార్జి మేయర్ ముంతాజ్ బేగం, ఎస్ఇసి సభ్యులు డాక్టర్ సోహెల్ అహ్మద్, కడప నియోజకవర్గంలో వైయస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమం ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను దూరం చేసే కూటమి ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించడం జరిగింది. అక్టోబర్ 28వ తేదీన కడప నగరంలో జరగబోయే ర్యాలీ మరియు ఇప్పటికే నియోజకవర్గం లో ప్రారంభమైన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యం తో విజయవంతం చేయాలని పిలుపునిచ్చాం. అక్టోబర్ 28న ఉదయం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమై ఆర్డిఓ ఆఫీస్ వరకు ర్యాలీ జరుగుతుందని అన్నారు.

# మనోబంధు పత్రిక ఆవిష్కరించిన చిత్తూరు కలెక్టర్





**చిత్తూరు, అక్టోబర్ 23 :** జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మనో బంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "Rescue - Rehab - Reunite" రాష్ట్రవ్యాప్తంగా మానసిక రుగ్మతలతో బాధపడుతూ తిరుగుతున్న వ్యక్తుల రక్షణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 23 నుండి నవంబర్ 18, 2025 వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమం ఏపీ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో, మున్సిపల్, వైద్య, పోలీసు, జిల్లా పరిపాలన మరియు సివిల్ సొసైటీ సంస్థల మద్దతుతో నిర్వహించబడుతోంది.

# విశ్వశాంతి నగర్‌లో ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**– అధికారులు, కాలనీవాసులతో మాట్లాడిన ఎమ్మెల్యే – వచ్చే వర్షాకాలంకి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్న ఎమ్మెల్యే**






**అనంతపురం,పెన్ పవర్ అక్టోబర్ 24 :** రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రుద్రంపేట పంచాయతీలో ముంపుకు గురైన విశ్వశాంతి నగర్‌లో పర్యటించారు. అధికారులు, స్థానిక నాయకులతో కలసి కాలనీ మొత్తం తిరిగారు. అక్కడ ఎంత మేర నీరు వచ్చింది... ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్నది ఆరా తీశారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు చూపించారు. అలాగే అధికారులు కూడా అందుబాటులో ఉండాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో అనంతపురం నగరంలో భారీ వర్షం వచ్చి చాలా కాలనీలు నీట మునిగాయన్నారు. అప్పట్లో కొందరి ఆక్రమణల వలన ఇబ్బందులు వచ్చాయన్నారు. వంకల్లో ఎక్కడా పూడిక తీయకపోవడం వలన కాలనీల్లోకి నీరు వచ్చిందన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నామన్నారు. వంకలకు ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని...త్వరలోనే అవి మంజూరవుతాయన్నారు. అకలంగా కురిసిన ఈ వర్షాలకు కాలనీలోకి నీరు వచ్చిందని.. కేవలం 50 కుటుంబాలకు మాత్రమే ఇబ్బంది కలిగిందన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో షెల్టర్ హెూమ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వచ్చే వర్షాకాలానికి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

# "చూపు లేకపోయినా ముందు చూపు గల గుడ్డివాడి కుంటివాడి కథ...



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS



**కడప పెన్ పవర్ అక్టోబర్ 24 :** అదొక మారుమూల కుగ్రామం, కాలినడక ప్రయాణాలు మాత్రమే ఉన్న ఆ పాత రోజుల్లో, ఆ ఊరిలో ఇద్దరు ఆప్తులు ఉండేవారు ఒకరు గుడ్డివాడు, మరొకరు కుంటివాడు. వారిద్దరూ కేవలం స్నేహితులు కాదు, ఒకరికొకరు తోడుగా నిలిచే చెడ్డీ దోస్తులు. వారి ఊరికి చాలా దూరంలో ఓ పెద్ద తిరునాల జరుగుతోంది. దానికి వెళ్లాలని ఇద్దరూ అనుకున్నారు. ప్రయాణం కష్టం కదా, అందుకే ఒకరినొకరు ఆసరా చేసుకున్నారు. కుంటివాడు దారి చూపడానికి గుడ్డివాడి భుజాలపై కూర్చున్నాడు, ఆ గుడ్డివాడు ప్రేమగా ఆ బరువును మోస్తూ, కాలిబాట వెంట నడక సాగిస్తున్నాడు. ఈ దృశ్యం చూస్తే, ఒకరి కొరతను మరొకరు ఎలా తీర్చుకున్నారో అర్థమవుతుంది. తెలతెలవారక ముందే మొదలైన వారి ప్రయాణం, మధ్యాహ్నం అయ్యేసరికి ఉగ్రరూపం దాల్చింది. నిగనిగ మెరుస్తున్న సూర్యుడు భగభగ మండిపోతున్నాడు. సూర్యుని వేడి కంటే, పొట్టలో ఆకలి మంటలు నకనకలాడుతూ పిండేస్తున్నాయి. . ఆకలికి "అన్నమో రామచంద్ర!" అని గుడ్డివాడు కుంటివాడితో వాపోగా, "ప్రాణము పోసిన వాడు నీరు పోయడా" పదా ముందుకు అని కుంటివాడు సముదాయిస్తూ నత్తనడకలా సాగుతున్నారు ముందుకు ఆ అంగవికలురు. ఏదో ఒక ఊరు దొరక్కపోతుందా అని, దారివైపు "కళ్లు కాయలు కాసేలా చూస్తూ " ముందుకు సాగుతున్నారు ఆ అంగవికలురు. ఇంతలో... భుజాలపై ఉన్న కుంటివాడు సంతోషంతో, ఎగిరి గంతేసినట్లు "అబ్బా! ఆకలి తీరిందిరా! అల్లంత దూరానా, దారి ప్రక్కనే ఉన్న ఓ మామిడి చెట్టు క్రింద కుప్పలు తిప్పలుగా మామిడి పండ్లు పడి ఉన్నాయ్!"

గుడ్డివాడు : "తొందర పడకురా సుందర వదనా! మెరిసేదంతా బంగారం కాదురా! ఈ బాటలో మనుషులు వస్తూ పోతూ ఉన్నారా? చెప్పు." కుంటివాడు: "లేదురా! కనుచూపు మేర మానవ సంచారమే లేదురా!" గుడ్డివాడు: "పోనీ! ఆ చెట్టుకు కంచె వేసి ఉంచారా!?"

చూపు గల కుంటివాడు: "లేదురా!"

ముందుచూపు గల గుడ్డివాడు : గట్టిగా పకపక నవ్వుతూ ఇలా అన్నాడు: "ఒరే పిచ్చివాడా! అవి తినే కాయలు కాదురా! అవి పిచ్చికాయలు (అడవి మామిడి పండ్లు)! తినేవైతే, ఇంత జన సంచారం లేని చోట, అదీ కంచె లేకుండా, దారి ప్రక్కన కుప్పలు కుప్పలుగా పడి ఉండేవి కావు కదా!" దృష్టి ఉన్నా, కుంటివాడు గ్రహించ లేని ఆ సత్యాన్ని అనుభవం, ఆలోచన, ముందు చూపుతో గుడ్డివాడు చూడ గిలిగాడు కదా. అలాగే మనం దృష్టి ఉన్నా.. ముందుచూపు లేని మానవులం కదా ! దిది ఇద్దరూ శారీరకంగా అంగవైకల్యంతో ఉన్నా, ఒకరికొకరు తోడుగా నిలిచి, ప్రయాణాన్ని సాగించారు. ఈ కథలో కుంటివాడు చూపు ఉన్నవాడు, గుడ్డివాడు చూపు లేనివాడు. కానీ చివరికి, ఎవరు నిజంగా "చూశారు" అనేది మనల్ని ఆలోచింపజేస్తుంది ఈ కద.

దిది చూపు అంటే కేవలం కళ్లతో కనిపించేది కాదు. అది ఒక పరిమితి కలది. మనం చూస్తున్నది నిజమా? తినదగినదా? నమ్మదగినదా? అనే ప్రశ్నలకు చూపు సమాధానం ఇవ్వదు. కుంటివాడు మామిడి పండ్లు కనిపించాయి కాబట్టి, అవి తినదగినవే అనుకున్నాడు. ఇది తక్షణ స్పందన.

దిది ముందుచూపు అనేది అనుభవం, ఆలోచన, వివేకం, మరియు లోతైన విశ్లేషణల సమ్మేళనం. గుడ్డివాడు తన చూపు లేకపోయినా, అనుభవంతో ఆ పండ్లను విశ్లేషించాడు. "ఇక్కడ జన సంచారం లేదు, కంచె లేదు, కాయలు కుప్పలు తిప్పలుగా పడి ఉన్నాయి ఇవి తినదగినవేనా?" అని ప్రశ్నించగలిగాడు. ఇది దూరదృష్టి, ఇది జీవన జ్ఞానం.

ఈ కథ మనకు నేర్పే జీవన పాఠాలు:

దిది తక్షణ లాభం కంటే దీర్ఘకాలిక పరిణామం ముఖ్యం . మెరిసే అవకాశాలు వెంట పరిగెత్తే ముందు, వాటి వెనుక ఉన్న నిజమైన విలువను అంచనా వేయాలి.

దిది సమాచారం ఉన్నా, వివేకం లేకపోతే ప్రమాదమే. నేటి ప్రపంచంలో సమాచారం చాలా ఉంది. కానీ ఆ సమాచారాన్ని వివేకంతో వాడే ముందు చూపు లేకపోతే, అది మోసపోవడానికి దారి తీస్తుంది.

దిది అనుభవం అనేది చూపుకన్నా గొప్ప ఆయుధం . కళ్లతో కనిపించని విషయాలను, మనసుతో, అనుభవంతో, ఆలోచనతో చూడగలగడం ు అదే నిజమైన చూపు.

ఇది మన జీవితంలో ఎలా వర్తిస్తుంది ?

– ఉద్యోగం ఎంచుకునేటప్పుడు, కేవలం జీతం చూసే చూపుతో కాకుండా, వృద్ధి అవకాశాలు, ఆత్మసంతృప్తి వంటి అంశాలను ముందుచూపుతో చూడాలి.

– పెట్టుబడి పెట్టేటప్పుడు, తక్షణ లాభం కాకుండా, దీర్ఘకాలిక స్థిరతను విశ్లేషించాలి.

– సంబంధాలను ఏర్పరచుకునేటప్పుడు, బాహ్య ఆకర్షణ కాకుండా, అంతరంగ విలువలు చూసే ముందు చూపు అవసరం.

**మానస సరోవరం**

# ఈ-శ్ర మ్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్




**అనంతపురం , పెన్ పవర్ అక్టోబర్ 24 :** జిల్లాలో ఈ -శ్రమ్ అసంఘటిత రంగ కార్మికుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశం తన అధ్యక్షతన జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 7 లక్షల 25 వేల వరకు నమోదు జరిగిందని లక్ష్యసాధనలో భాగంగా ఇంకనూ 1,50,000 వరకు నమోదు పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. దీనికై సంబంధిత శాఖ అధికారులు సమన్వయం చేసుకొని లక్ష్యసాధనను పూర్తి చేయాలన్నారు. బాగున్నా నిర్మాణ కార్మిక చట్టం కింద అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు నిర్మాణాలలో భాగంగా మొత్తం నిర్మాణ వ్యయం లో 1 శాతం ఆంధ్ర ప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి కి జమ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందులో అన్ని ప్రభుత్వశాఖలుమునిసిపాలిటీలు పంచాయతీరాజ్ సంస్థలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే సెస్సు వసూలు చేసి బోర్డుకు జమ చేయని మున్సిపాలిటీలు పంచాయతీ సంస్థలు ప్రభుత్వ శాఖలు వెంటనే జమ చేయాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా ప్రతి నెల వసూలు చేసిన సెస్సు మొత్తాన్ని వచ్చే నెల 10 వ తారీకు లోగా జమ చేయాలని ఆదేశించారు. అలాగే వార్షిక నివేదికలను తప్పనిసరిగా అన్నాక్సర్ - 5 లో సమర్పించాలని ఆదేశించారు. మరి ముఖ్యంగా ఈ శ్రమ్ పై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమంలో చేపట్టి సామాజిక భద్రత పథకాల లబ్ధి మరియు వారి సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా అసంఘటిత కార్మికులను చైతన్యవంతం చేసి నమోదు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉప కార్మిక కమిషనర్ లక్ష్మీనరసయ్య, డిఆర్డిఏ పిడి శైలజ, డ్వామా పీడీ సలీం బాషా, అన్ని మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

### కష్టకాలంలో మన ఆలోచనలకు

# కొత్త కోణాన్ని ఎలా ఇవ్వగలం?





**కన్హా పెన్ పవర్ అక్టోబర్ 24 :** సృజనాత్మకమైన ఆలోచన వందల సంవత్సరాల క్రితం, ఇటాలీలోని ఒక పట్టణంలో, చిన్న వ్యాపారి ఒక వడ్డీ వ్యాపారి వద్ద అప్పు చేసి భారీ మొత్తంలో డబ్బు బాకీ ఉన్నాడు. వడ్డీ వ్యాపారి వృద్ధుడు, కపటి, పెద్ద మోసగాడు. ఆ వ్యాపారి కూతురిని పెళ్లి చేసుకోవాలన్న దురుద్దేశంతో ఉన్నాడు. వ్యాపారి కూతురిని తనకిచ్చి పెళ్లి చేస్తే అప్పులన్నీ మాఫీ చేస్తానని ఆ వడ్డీవ్యాపారి షరతు పెట్టాడు. ఇది చాలా అల్పమైన పందెం అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వడ్డీ వ్యాపారి "ఒక సంచిలో రెండు గులకరాళ్లు వేస్తాను, ఒకటి తెలుపుది, ఒకటి నలుపుది. నీ కూతురు సంచిలోంచి ఒక గులకరాయి తీయాలి. నల్లది తీస్తే మీ ఋణం అంతా మాఫీ అయిపోతుంది, కానీ నీ కూతురు నన్ను పెళ్లి చేసుకోక తప్పదు. తెల్లని గులక రాయి తీస్తే నీ ఋణం మొత్తం మాఫీ అవుతుంది కానీ ఆ స్థితిలో నీ కూతురు నన్ను పెళ్లి చేసుకోనవసరం లేదు", అన్నాడు. చిన్న వ్యాపారి తోటలో గులకరాళ్లతో నిండి ఉన్న దారిలో నిలబడి, వడ్డీ వ్యాపారి వంగి రెండు గులకరాళ్లు తీసుకున్నాడు. అతను గులకరాళ్లు ఏరుకుంటూ, తన మోసపూరితమైన స్వభావంతో ఎవ్వరికీ కనిపించకుండా రెండు నల్లగా ఉన్న గులకరాళ్ళను ఏరుకున్నాడు. అయితే వడ్డీ వ్యాపారి రెండూ నల్ల గులకరాళ్లనే ఏరుకుని ఆ రెండింటినీ సంచిలో పెట్టుకోవడం వ్యాపారి కూతురు చూసింది. అప్పుడు అతను తన సంచిలో నుండి ఒక గులకరాయిని తీయమని వ్యాపారి కుమార్తెను అడిగాడు. సహజంగానే వ్యాపారి కుమార్తెకు మూడు ఎంపికలు ఉన్నాయి :

1. సంచిలో నుండి గులకరాయిని తీయడానికి నిరాకరించడం.
2. సంచిలోంచి రెండు గులకరాళ్లనూ బయటకు తీసి వడ్డీ వ్యాపారి మోసానికి పాల్పడినట్లు బహిర్గతం చేయడం.
3. అది నల్ల గులకరాయి అవుతుందని తెలిసీ కూడా సంచిలోంచి ఒక గులకరాయి తీసి, తన తండ్రి ఋణం మాఫీ అవడం కోసం తనను తాను త్యాగం చేసుకోవడం.

అయితే ఆమె చేసింది ఈ మూడింటి కంటే వైవిధ్యంగా ఉంది! ఆమె సంచిలోంచి గబుక్కున ఒక గులకరాయిని తీసి, దాన్ని ఎవ్వరూ చూడకముందే వెంటనే ఇతర గులకరాళ్ళ మధ్యలో పడేసింది. అప్పుడామె వడ్డీ వ్యాపారితో, "అయ్యో, క్షమించండి, కంగారులో నా చేతిలోంచి గులకరాయి జారిపోయింది. అయినా ఫర్వాలేదు, సంచిలో మిగిలిన గులకరాయిని చూస్తే, నేను పడేసిన రాయి రంగు ఏమిటో మీకు తెలుస్తుంది !" అంది.సంచిలో మిగిలిపోయిన గులకరాయి నల్లగా స్పష్టంగా కనబడుతూ ఉంది. వడ్డీ వ్యాపారి తాను చేసిన మోసాన్ని బహిర్గతం చేయడానికి ఇష్టపడలేదు. వ్యాపారి కూతురు చేతిలో నుండి జారిపోయిన గులకరాయి తెల్లదని అతను అంగీకరించాల్సి వచ్చింది. ఈ విధంగా వ్యాపారి కూతురు వడ్డీ వ్యాపారి యొక్క దుష్ట ఆలోచనల నుండి తనను తాను రక్షించుకోవడమే కాకుండా, తన తండ్రిని అప్పుల నుండి విముక్తి చేసింది. క్షుణ్ణంగా ఆలోచించడం ద్వారా క్లిష్ట పరిస్థితిని అధిగమించడం ఎల్లప్పుడూ సాధ్యపడుతుంది. పరిమిత పరిధిని దాటి ఆలోచించడం, ఎంచుకునే స్వేచ్ఛను ఇస్తుంది, కొత్త అవకాశాలకు దారితెరుస్తుంది. ధ్యాన సాధన మనకిచ్చే ముఖ్యమైన బహుమతి, విచక్షణ. ధ్యానం చేసే మనస్సు, "నాకు ఏది సరైనది? నాలో ఏది అభివృద్ధి చెందుతోంది? నన్ను ఏది ఉద్ధరించగలదు?" అనేవి వెంటనే గుర్తిస్తుంది. అటువంటి స్పష్టత ఉన్నప్పుడు, జ్ఞానం తక్కువగా ఉన్నప్పటికీ, నిర్ణయాలు త్వరగా తీసుకోగలుగుతాం. హృదయంపై ధ్యానం ఒక రకమైన హైపర్ లూప్‌ను (అయస్కాంత శక్తి సహాయంతో కదలికను వేగవంతం చేసే సాంకేతికత) సృష్టిస్తుంది. దీనిలో మనం అంతర్గత మార్గదర్శకత్వం పొందడమే కాకుండా నిర్ణయాలు కూడా త్వరగా తీసుకుంటాం.

**దాజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**

# ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవం వారోత్సవాలు...





**కడప పెన్ పవర్ అక్టోబర్ 24 :** కడప నగరంలో కడప జిల్లా ఆహార పరిరక్షణాదికారి వారి ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవ వారోత్సవాల్లో అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 27 వరకు, అందులో భాగంగా కడప నగరంలో గాంధీనగర్ పాత శాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత మాట్లాడుతూ మనము నిత్యము తీసుకునేటటువంటి ఆహార పదార్థాలలో అయోడిన్‌తో కూడుకున్నటువంటి నాణ్యత ప్రమాణాలు కలిగినటువంటి ఉప్పును మాత్రమే వాడాలని వ్యాపార సంస్థల



అధినేతలకు, డీలర్లకు,హెూటళ్ల యజమానులకు, విద్యార్థులకు సూచించారు. అయోడిన్ లోపంతో ఉన్నటువంటి ఆహార పదార్థాలను తీసుకోవటం వలన కలిగే అనర్థాలను, నాణ్యతా ప్రమాణాలు కలిగిన ఉప్పును సరియైన మోతాదులో తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను, సరియైన మోతాదులో తీసుకోకపోవడం వలన కలిగేటటువంటి అనర్థాలను గురించి వివరించారు. గాంధీనగర్ ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ అయోడిన్ లోపం వలన థైరాయిడ్, దాని లోపం వలన క్యాన్సర్ కు దారితీస్తుందని విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేశారు. నవీన్ మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలు కలిగిన అయోడిన్ వలన అనేక ఉపయోగాలు ఉన్నాయని, అయోడిన్ లేనిచో కలిగే అనర్థాలను, వ్యాధుల గురించి తెలియజేశారు. జిలాని భాష మాట్లాడుతూ మంచి నాణ్యత కలిగినటువంటి ఉప్పును మాత్రమే మార్కెట్లో విక్రయించాలని అందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వ్యాపారవేత్తలు, హెూటల్ యజమానులు, హెూటల్ అసోసియేషన్ అధ్యక్షులు నవీన్, ప్రముఖ వ్యాపారవేత్తలు జిలాని భాష, భరత్, రమేష్, మహేంద్ర, వెంకట సురేంద్ర, సంజీవరావు, యూసఫ్, ఆసిఫ్, నవాబ్ కడప కిరాణా అసోసియేషన్ పాత మార్కెట్, విద్యార్థినీ విద్యార్థులు, హెూటల్లో పని చేసే మాస్టర్స్, యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

# 28 న దక్షిణ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో భారీ ప్రజా ర్యాలీ



- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
- ప్రజా ఉద్యమానికి వాసుపల్లి పిలుపు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 24 :**ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతి రేకిస్తూ వైఎస్సార్సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సా హభరితంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో దక్షి ణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మె ల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, అక్టోబర్ 28 వ తేదీన దక్షిణ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించను న్నట్లు తెలిపారు.అశీలమెట్టలో శుక్రవారం వైఎస్సార్సీపీ శ్రేణులతో జరిగిన సమావేశంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ పోస్టర్ను వాసుపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ప్రజల విశేష స్పందనతో కోటి సంతకాల ఉద్యమం విజయవంతంగా సాగుతోంది. ప్రతి కార్యకర్త ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలి. వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల కలల సాధన కోసం నిర్మించిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం పేదలపై దెబ్బ" అన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళ్తోందని విమర్శించిన వాసుపల్లి, చంద్రబాబు పాలన అబద్ధాల మయమైందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను ప్రజలకు వివరించాలి అని పిలుపు నిచ్చారు.డాక్టర్ కావాలనే పేద విద్యార్థుల కలను, అందరికీ అందుబాటులో వైద్యం అనే సంకల్పాన్ని కూటమి ప్రభుత్వం ధ్వంసం చేయ నివ్వం. ప్రజలతో కలిసి ఈ ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేస్తాం అని వాసుపల్లి దృఢంగా అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షు లు, అనుబంధ సంఘాల నాయకులు మరియు దక్షిణ వైఎస్సార్సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మనవత్వం చాటారు

- క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సాయం స్వయంగా వెళ్లి పరామర్శ





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 24 :**దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మరోసారి తన మనవత్వాన్ని చాటుకున్నారు. క్యాన్సర్ బాధితులైన ఇద్దరు పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ, వారి కుటుంబ స భ్యులను స్వయంగా పరామర్శించారు.33వ వార్డు అధ్యక్షుడు రమేష్, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము ఆధ్వర్యంలో, 33వ వార్డుకు చెందిన ఈటి లక్ష్మి ఇంటికి వెళ్లిన వాసుపల్లి గణేష్‌కుమార్, ఆమె వైద్య ఖర్చుల కోసం రూ.2,500లను అందజేశారు. అదే విధంగా, 39వ వార్డు ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం భార్య అనారోగ్యంతో ఉన్నట్లు తెలుసు కొని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి రూ.2,500 లను సహాయం చేశారు.ఈ సందర్భంగా వాసు పల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ, పేద ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం మన అందరి బాధ్య త అని పేర్కొన్నారు. ఎప్పుడైనా సహాయం అవసరం ఉన్నవారు తనకు సంకేతం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ విభాగం అధ్యక్షు డు సనపల రవీంద్ర భరత్, 39వ వార్డు అధ్యక్షు డు ముజీబ్ ఖాన్, 37వ వార్డు అధ్యక్షుడు గనగళ్ల రామరాజు, దూడ తాతారావు, చౌడేపల్లి శివ, సాగర్, మహబూబ్ బేగం, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమణ

- నిమ్మరసం ఇచ్చి సమ్మె విరమణ చేసిన నాయకులు
- సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 24:-**
చింతపల్లి ఏరియా ఆసుపత్రి లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ఉన్నతాధికారులు అంగీకారం తెలపడంతో రిలే నిరాహార దీక్షలు విరమించారని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రమైన చింతపల్లిలో ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారానికి గత మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఈ సందర్భంగా దీక్షలు చేపట్టిన పారిశుధ్య కార్మికులను శు క్రవారం ఆయన నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు పోరాడి విజయం సాధించారని ఆయన అన్నారు. ఇదే స్ఫూర్తితో హామీలు అమలు కోసం, అదే క్రమంలో సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు, ఈ మేరకు గత కాంట్రాక్టు చేసిన తప్పిదం వల్ల ఈపీఎఫ్ ఈఎస్ఐ డిసెంబర్ లోగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, బకాయి పడ్డ పెండింగ్ వేత జీతాలు,వారంలోగా, ఒక నెల వేతనం ఇస్తానని హామీ ఇచ్చారని, మిగిలిన వేతనాలు ఇవ్వడానికి సిద్ధపడ్డారని అన్నారు, ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, రామారావు ఈశ్వరరావు, గిరిబాబు గున్నమ్మ, రాములమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## పొట్నూరు గ్రామంలో రీ-సర్వే పనులపై తహసిల్దార్ ఆనందరావు సమీక్ష



**పద్మనాభం,పెన్ పవర్ అక్టోబర్ 24 :**పద్మనాభం మండలంలోని పొట్నూరు గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను మండల తహసిల్దార్ కే. ఆనందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామం లోని ప్రతి రైతు భూమి సరిహద్దులు స్పష్టంగా గుర్తించబడడం ద్వారా భవిష్యత్తులో భూ వివా దాలు తగ్గి, రైతులకు న్యాయమైన హక్కులు లభిస్తాయని పేర్కొన్నారు.తహసిల్దార్ రీ-సర్వే సిబ్బందిని సుదీర్ఘంగా ఆరా తీసి, మ్యాపింగ్ మరియు సరిహద్దుల గుర్తింపు పనులు ఖచ్చి తంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్వే డీ.టీ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి.శ్యామల, మండల సర్వేయర్ రామకృష్ణ, రీ-సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## నాగుల చవితి సందర్భంగా వి.ఎం.ఆర్.డి.ఏ. పార్కులకు ఉచిత ప్రవేశం




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 24 :**నాగుల చవితి పండుగ సందర్భంగా నగర ప్రజల సౌకర్యార్థం నేడు శనివారం వి.ఎం.ఆర్. డి.ఏ. పరిధిలోని అన్ని పార్కులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు వి.ఎం.ఆర్.డి.ఏ. చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగుల చవితి సందర్భంగా పుట్టల్లో పాలు పోసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రజలు పెద్ద సంఖ్య లో పార్కులకు, ముఖ్యంగా బీచ్ రోడ్ పరిసర ప్రాంతాలకు రావచ్చని, అందువల్ల అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని తెలిపారు.బీచ్ రోడ్‌లోని వి.ఎం.ఆర్.డి.ఏ. పార్క్, సెంట్రల్ పార్క్, కైలాసగిరి, తెన్నేటి పార్క్ వంటి అన్ని ప్రధాన పార్కుల్లో నేడు ప్రవేశ రుసుము ఉండ దని చెప్పారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, నగర ప్రజలందరికీ నాగుల చవితి శు భాకాంక్షలు తెలుపుతూ ప్రణవ్ గోపాల్ కుటుంబాలతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం లక్ష్యం

జానపద కళల సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 24:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జనసేన పార్టీ కోర్ కమిటీ మరియు జనసేన పార్టీ నాయకులతో పాడేరు జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యం. జనసేన తరఫున గెలుపు గుర్రాలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని కోర్ కమిటీ కోరినందుకు సంతోషంగా ఉంది. గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులను గుర్తించి, బలమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. అలాగే "జనసేన శ్రేణులు కూటమి భాగస్వాములతో కలిసి ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా కృషి చేయాలి. టికెట్లు ఇస్తామని చెప్పి మోసం చేసే నాయకుల మాటలను నమ్మవద్దు. జీకే వీధి మండలం అన్ని మండలాలకు ఆదర్శంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు 16 పంచాయతీలు, 18 ఎంపీటీసీలకు సంబంధించి వ్యూహరచన చేపట్టారు. కొంతమంది పంచాయతీలలో అభ్యర్థుల స్థితిగతులు, గెలుపు అవకాశాలు, ప్రజల్లో వారికున్న ఆదరణపై అధ్యయనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.సమావేశంలో జీకే వీధి మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీర వెంకట్, ప్రధాన కార్యదర్శి పొత్తూరు విశ్వమూర్తి, కొయ్యం ఇమ్మానుయేల్ (సిద్ధు), ఉలం ఈశ్వరరావు, గడుతూరి పరమేశ్వరరావు, గుండ్ల రఘువంశి, చిక్కుడు అశోక్, మధు,వి.ఈశ్వర్,ఎం.కళ్యాణ్ చక్రవర్తి, గబులంగి గణేష్, సాగిన బ్రాహ్మజీపడాల్, పాంగి శ్రీను,ఎం. సతీష్, గడుతూరి రమణబాబు, విరోజీ త్రిమూర్తులు, ఉలంగి నరేంద్ర కుమార్, వంతల రాజుబాబు, బూడిద రామరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధహామీ క్షేత్రస్థాయి సహాయకుడు వినయ్ కుమార్ పై విజిలెన్స్ అధికారులు విచారణ.....



**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 24):** మండలంలో గల గునుపూడి గ్రామ ఉపాధి హామీ క్షేత్రస్థాయి సహాయకుడు వినయ్ కుమార్ పై శు క్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు.ఉపాధి హామీ క్షేత్రస్థాయి సహాయకుడు వినయ్ కుమార్ దొంగ మచ్చర్లు వేస్తున్నారు అంటూ ఇదే గ్రామానికి చెందిన అనిమిరెడ్డి నాగు అనే వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా నిఘా విభాగం అధికారి శ్రీమతి దేవి శ్రీ లలిత గునుపూడి వచ్చి ఇంటింటికి వెళ్లి విచారణ నిర్వహించారు. విచారణ నివేదికను డ్వామా పిఓ కి, ముఖ్యమంత్రికి నివేదిక అందజేయునట్లు శ్రీలలిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎం సత్య సాయి శ్రీనివాస్, ఏపీవో కొండాజి, రాష్ట్ర ఎస్సీ మాల్ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతి సాంప్రదాయలో - దీపావళి స్నానాలు ప్రత్యేకం

- దారెల, సుజనకోట పంచాయతీ కేంద్రాలలో ఘనంగా దీపావళి స్నానాలు.
- ఐదు నుండి పది ఏళ్ల చిన్నారులు పంచే కట్టే కార్యక్రమం.
- చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో వచ్చి దీపావళి స్నానాలు చేయడం అనవాయితీ.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 24.**గిరిజన సంస్కృతిక సాంప్రదాయాల్లో దీపావళి స్నానాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.
ఐదు నుండి పదేళ్లలోపు ఆడపిల్లల పంచేకట్టు దీనిలో ప్రత్యేకత. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల దారెల గ్రామంతో పాటు సుజనకోట పంచాయతీ కేంద్రంలో దీపావళి పండుగ అనురాధ నక్షత్రంలో పూర్వికుల నుండి వచ్చే గిరిజన సాంస్కృతిక సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో ఉండే వాల్మీకి కులానికి చెందిన వారు వారి చిన్నారులను స్నానాలు చేయించి, పంచేకట్టే కార్యక్రమం గిరిజన సాంప్రదాయ ఆనవాయితిలో భాగంగా బంధువులు స్నేహితులను గ్రామంలో తీసుకుని వచ్చి వేదమంత్రాలు, బాజ భజంత్రీలు నడుమ స్నానాలు చేయించి పంచే కట్టించడం వాల్మీకి కులస్తులకు ప్రత్యేక సాంప్రదాయంగా ఇప్పటి వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సామూహిక స్నానాలు ఘనంగా నిర్వహించారు. దీపావళి స్నానాలు చేయించుటకు చుట్టుపక్కల గ్రామస్తులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో వచ్చి స్నానాలు ఆచరిస్తారు. అలాగే పంచే కట్టు స్నానాలు ఐదు సంవత్సరాల నుండి పది సంవత్సరాలు వయసు కలిగిన ఆడపిల్లలకు స్నానాలు చేయిస్తారు. ఆ రోజు నుండి చుట్టుపక్కల గ్రామస్తులు ఎవరి ఇంటికి వస్తారో బంధువులుగా మారి నేస్తం చుట్టాలుగా పిలుచుకోవడం పూర్వీకుల నుండి ఇప్పటి వరకు వస్తున్నా గొప్ప సాంప్రదాయంగా చెప్పవచ్చు. ఎప్పుడైతే నేస్తం చుట్టాలుగా భావించుకుంటారో ఆ రోజు నుండి పేర్లు పట్టి పలకరించడం పూర్తిగా విడిచిపెట్టడం మరొక ఎత్తుగా భావిస్తారు. ఎక్కడ కనిపించిన నేస్తంగానే పిలుచుకోవడం సాంప్రదాయానికి పూర్వీకులు వేసిన పునాది. మండలంలో సుజనకోట, కించాయిపుట్టు చివుకుచింత, దేగలపుట్టు, సున్నంకోట, కిలగాడ, మినుములపుట్టు తదితర గ్రామాలలో దీపావళి స్నానాలు, పంచేకట్టు కార్యక్రమాలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, గ్రామ పెద్దలు పాంగి వైకుంఠం, మన్మథరావు, ఏ ఈశ్వరరావు, మత్స్యరాజు, చెండా శేషయ్య, చెట్టి నీలకంఠం, గడుతుల సుందర్రావు, ఏ ప్రసాదరావు ఎస్ శంకర్ రావు, సదానందం, కె మోహన్, ధర్మారావు ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒక్కొక్కరూ దూరమవుతున్నారా

**ఒంగోలు, అక్టోబరు 24, పెన్ పవర్:** కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి వ్యవహారం వైసీపీలో హాట్ టాపిక్ గా మారింది. అసలు ఆయన పార్టీలో ఉన్నారా? లేదా? అన్న అనుమానం వైసీపీ నేతల్లో కలుగుతుంది. వైసీపీలో మాత్రంయాక్టివ్ గా లేరని మాత్రం ఖచ్చితంగా చెప్పాలి. ఒక రకంగా చూస్తే మానుగుంట మహీధర్ రెడ్డి రాజకీయాల నుంచి వైదొలగారా? లేక ఇతర పార్టీల వైపు చూస్తున్నారా? అన్న అనుమానం ఆ పార్టీ నేతలకు కూడాకలుగుతుంది. మానుగుంట మహీధర్ రెడ్డి కుటుంబానికి మంచి పట్టున్న నియోజకవర్గంలో వైసీపీ కార్యక్రమాలు సక్రమంగా జరగకపోవడం పై కూడా పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు అందినట్లు చెబుతున్నారు. అదేసమయంలో గత ఎన్నికల్లో మానుగుంట మహీధర్ రెడ్డికి టిక్కెట్ కూడా దక్కలేదు ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఒకప్పుడు ప్రకాశం జిల్లాలో ఉన్న నియోజకవర్గం కందుకూరు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత 1983నుంచి చూస్తే ఈ నియోకవర్గంలో టీడీపీ అంత సానుకూల పరిస్థితులు లేవు. 1983 నుంచి 2024 వరకు జరిగిన ఎనిమిది ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 1994, 1999, 2024 ఎన్నికల్లో మాత్రమేవిజయం సాధించింది. కందుకూరు నియోజకవర్గం మానుగుంట ఫ్యామిలీకి కంచుకోటే అని చెప్పాలి. మానుగుంట ఫ్యామిలీకి చెందిన మానుగుంట మహీధర్ రెడ్డి, ఆయన తండ్రి ఆదినారాయణ రెడ్డి ఇక్కడ నుంచి చెరోమూడు సార్లు మొత్తంగా ఆరు సార్లు విజయం సాధించారు. మానుగుంట మహీధర్ రెడ్డి తండ్రి మానుగుంట ఆదినారాయణ రెడ్డి 1972లో ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు. 1983, 1985లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం ప్రభంజనం వీచినా కందుకూరులో మాత్రం ఆదినారాయణ రెడ్డి విజయం సాధించారు. గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో... అయితే గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ కందుకూరు టిక్కెట్‌ను మానుగుంట మహీధర్ రెడ్డికి కాదని బుర్రా మధుసూదన్ యాదవ్ కు ఇచ్చారు. ఆయనను కనిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉండగా అక్కడి నుంచి మార్చి కందుకూరు టిక్కెట్ ఇచ్చారు. దీంతో అప్పటి నుంచిమానుగుంట మహీధర్ రెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎక్కువగా ఆధ్మాత్మిక కార్యక్రమాలకు పరిమితమవుతున్నారు. ఇటీవల తిరిగి జగన్ మానుగుంట మహీధర్ రెడ్డితో మాట్లాడేందుకు ప్రయత్నించినాసున్నితంగా తిరస్కరించారంటున్నారు. ఇటీవల జరిగిన కందుకూరు నియోజకవర్గంలో జరిగిన హత్య విషయంలోనూ మానుగుంట మహీధర్ రెడ్డి కనిపించకపోవడం కూడా ఈ ఊహాగానాలకు మరింత ప్రచారాన్నిపెంచింది. మొత్తం మీద ఒక కీలక నేత, పట్టున్న నేత మానుగుంట మహీధర్ రెడ్డి రాజకీయాల్లో ఉంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు.

## అన్నిమంచి శకునాలే...

**విజయవాడ, అక్టోబరు 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ కు అన్నీ శుభశకునాలే. ఒకవైపు విశాఖకు ఐటి దిగ్గజ సంస్థలు వస్తున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు ఒప్పందం కూడా కుదిరింది. ఇది మిగతా రాష్ట్రాల్లో కూడాచర్చకు దారితీస్తోంది. ఇంకోవైపు అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఒకవైపు విశాఖకు ఐటి పరిశ్రమలు.. ఇంకోవైపు అమరావతికి విదేశీ పెట్టుబడులు వరదలా వస్తున్నాయి. ప్రస్తుతం ఏపీ సీఎంచంద్రబాబు దుబాయ్ పర్యటనలో ఉండగా అక్కడి పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా శోభ గ్రూప్ చైర్మన్ పిఎన్సి మీనన్ తో చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతిలో అధునాతన లైబ్రరీ ఏర్పాటు కోసం 100 కోట్ల రూపాయల విరాళం ప్రకటించింది శోభ గ్రూప్ ఆఫ్ కంపెనీస్. ఇది నిజంగా అమరావతికి శుభవార్త. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతినినిర్మించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. నవ నగరాలను నిర్మించి ప్రపంచ పటంలో అమరావతికి చోటు కల్పించాలన్నది చంద్రబాబు లక్ష్యం. అందుకే అహర్నిశలు శ్రమిస్తున్నారు. ప్రపంచం గుర్తించేలా నిర్మాణాలుచేపడుతున్నారు. అందులో భాగంగా వరల్డ్ క్లాసు లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అదే విషయాన్ని తన దుబాయ్ పర్యటనలో శోభ గ్రూప్ చైర్మన్కు చెప్పడంతో ఆయన అంగీకరించారు. 100 కోట్ల రూపాయలువిరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. చంద్రబాబు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు ఆహ్వానించారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి4 కార్యక్రమంగురించి కూడా ఆయనకు వివరించారు సీఎం చంద్రబాబు. అమరావతిలో 150 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ లైబ్రరీ నిర్మాణం ప్రారంభించిన 24నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. దీంతో పాటుగా రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీల ఏర్పాటుకు నిర్ణయించారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన మోడల్ లైబ్రరీల నిర్మాణంఉండనుంది. పెద్ద ఎత్తున దాతల సహకారంతో లైబ్రరీల ఏర్పాటుకు నిర్ణయించింది. విశాఖలో 20 కోట్ల రూపాయలతో మోడల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటుంది. అయితే అమరావతిలో మోడల్ లైబ్రరీ నిర్మాణానికి ఒక అంతర్జాతీయ సంస్థ రూ.100 కోట్లు విరాళంగా ప్రకటించడం మాత్రం ఒక రికార్డ్.

## 4 గంటల్లో సింగపూర్...

**విజయవాడ, అక్టోబరు 24, పెన్ పవర్:** ఏపీలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఇప్పటికే పనులు ప్రారంభం అయ్యాయి. మరోవైపు ప్రైవేటు సంస్థలకు కేటాయించిన భూముల్లోనిర్మాణాలు ప్రారంభించాయి. ఒకేసారి 12 ప్రధాన బ్యాంకుల కేంద్ర కార్యాలయాల నిర్మాణం ప్రారంభం కానుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమక్షంలో వాటికి శంకుస్థాపన జరగనుంది. ప్రపంచ దిగ్గజపర్యాటక సంస్థలు అమరావతికి వస్తున్నాయి. పేరు మోసిన హోటళ్ల నిర్మాణం కూడా జరగనుంది. ఇటువంటి తరుణంలో విజయవాడ విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి పెరిగింది. అందుకే కొత్త విమాన సర్వీసులుఅందుబాటులోకి వస్తున్నాయి. పలు ప్రైవేటు విమానయాన సంస్థలు సైతం కొత్త సర్వీసులు నడిపేందుకు ముందుకు వస్తున్నాయి. ఆక్యుపెన్సికి అనుగుణంగా సర్వీసుల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటున్నారు. తాజాగా ఇండిగో సంస్థ సింగపూర్ కు డైరెక్ట్ ఫ్లైట్ను ప్రారంభించింది. ఎందుకు ముహూర్తంతో పాటుగా టికెట్ ధర, విమాన వేళలను సైతం సంస్థ ప్రకటించింది. తద్వారా నాలుగు గంటల్లో సింగపూర్ కు వెళ్లే అవకాశం దక్కుతోంది. సింగపూర్ తో ఏపీకి ప్రత్యేక అనుబంధం ఉంది. అక్కడ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువ. ఏపీకి చెందిన లక్షలాది మంది అక్కడ స్థిరపడ్డారు. వర్తక, వాణిజ్య అవకాశాలు కూడా అక్కడ ఎక్కువ. ఈతరుణంలో సింగపూర్ కు విమాన రాకపోకలు పెరిగాయి. దీనిని గుర్తించిన ఇండిగో సంస్థ విజయవాడ నుంచి నేరుగా సింగపూర్ కు విమాన సర్వీసులు ప్రారంభించనుంది. నవంబర్ 15 నుంచి ఈ సర్వీసులుఅందుబాటులోకి రానున్నాయి. దీనికి సంబంధించిన చార్జీలు, టైమింగ్స్ ను సైతం ప్రకటించారు. సామాన్య మధ్య తరగతి ప్రజల అవసరాల దృష్ట్యా టికెట్ ధరలను అందుబాటులోకి ఉంచింది ఇంటికివ సంస్థ. టికెట్ ధరనుఎనిమిది వేల రూపాయలుగా నిర్ణయించింది. సింగపూర్ నుంచి బయలుదేరే విమానం ఉదయం 7:45 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటుంది. అదే విమానం ఉదయం 10 గంటలకు తిరిగిబయలుదేరుతుంది. మధ్యాహ్నం రెండు ఐదు గంటలకు సింగపూర్ లోని సాంగి విమానాశ్రయానికి చేరుకుంటుంది. ప్రయాణ సమయం కేవలం నాలుగు గంటల మాత్రమే. ఇప్పటికే ఈ విమానానికి సంబంధించిన టిక్కెట్లవిక్రయాలు కూడా ప్రారంభం అయ్యాయి. అయితే వారంలో మూడు రోజులపాటు మాత్రమే ఈ సర్వీసులు నడవనున్నాయి. మంగళవారం, గురువారం, శనివారం మాత్రమే ఈ విమానాలు నడుస్తాయి. 180 నుంచి 230సీట్ల సామర్థ్యం వరకు ఉంటుంది. అయితే ప్రయాణికుల రద్దీ పెరిగితే మాత్రం ఇండిగో విమాన సర్వీసుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

## మృతులను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు

## సత్యకుమార్ యాదవ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

**విజయవాడ: పెన్ పవర్:** కర్నూల్ లో జరిగిన బస్సు దగ్ధం ఘటనలో మరణించిన వారిని గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాల సేకరణ జరుగుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంటుకు ఆదేశాలు ఇచ్చామన్నారు." బస్సులోనే భౌతిక కాయాలు ఉన్నాయి పరిస్థితులకు అనుగుణంగా ఘటన స్థలం వద్దే భౌతిక కాయాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం . ఫోరెన్సిక్ వైద్యులను ఘటన స్థలానికి పంపించాం. భౌతిక కాయాల తరలింపునకు మహాప్రస్తానం వాహనాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. చనిపోయిన వారిని గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాలు కూడా సేకరిస్తున్నాం. స్వల్పగాయాలతో 12 మంది ఆసుపత్రిలో చేరారు. ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రుల్లో ఆరుగురు డిశ్చార్జి అయ్యారు. బస్సులో (ఎత్తు) నుంచి దిగడంవల్ల ఒకరికి ఎక్కువ దెబ్బలు తగిలాయి. ఈయన ఆరోగ్య పరిస్తితి నిలకడగానే ఉందని అన్నారు.

# ఆల్ ఈజ్ వెల్ కాదా పవన్ వర్సెస్ రఘురామ...



**భీమవరం, అక్టోబరు 24, పెన్ పవర్:** కూటమి లో అంతా బాగానే ఉన్నట్టు అటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కేడర్‌కు సర్ది చెబుతూనే ఉంటారు. కానీ ఎప్పటికప్పుడు వాళ్లలో ఉన్న బేదాభిప్రాయాలు చాలా అంశాల్లో బయటపడుతూనేఉన్నాయి. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే అధికారి అంశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం కూటమిని ఉలిక్కిపడేలా చేసింది అనడంలో అనుమానమేలేకుండా పోయింది. భీమవరం డీఎస్పీ జయసూర్యపై చాలాకాలంగా ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా పేకాట, జూదం లాంటి వాటిని ప్రోత్సహించడంతోపాటు ఎవర్నీ లెక్క చేయడం లేదనేది ఆయనపై ఉన్న ఆరోపణ. దానితో ఆయన్ను గతంలో ట్రాన్స్ఫర్ చేసినా మళ్ళీ భీమవరానికి పోస్టింగ్ తెచ్చుకోవడం స్థానిక ఎమ్మెల్యే (జనసేన ) తన అభిప్రాయానికి కూడా ఈ ఇష్యూలో విలువ లేదనడంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌స్వయంగా ఈ అంశంలో కలుగజేసుకున్నారు. డీజేపీని దీనిపై సమాచారం కోరడంతో వెంటనే రియాక్ట్ అయిన సీఎం, హోంమంత్రి, డీజీపీ సదరు అధికారిపై చర్యలు తీసుకున్నారు. హోంమంత్రి అనిత దీనిపై మాట్లాడుతూకూటమిలో అంతా బానే ఉందని పవన్ ఆ అధికారిపై స్పందించక ముందే తమ వద్ద సమాచారం ఉందని అందుకే వెంటనే యాక్షన్ తీసుకున్నమని సర్ది చెప్పుకొచ్చారు. అయితే ముందుగానే జయసూర్య వ్యవహారంపైసమాచారం హోంశాఖ వద్ద ఉంటే ఇన్నాళ్లు తనకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం ఎందుకు చెయ్యలేదు అనే ప్రశ్నకు సమాధానం లేదు. ఇక లేటెస్ట్‌గా డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ ఆ అధికారి చాలా మంచివాడు అని తనపై పవన్ కళ్యాణ్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారని అనడం తీవ్ర సంచలనం సృష్టించింది. అంటే స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)పవన్‌కు తప్పు సమాచారం ఇచ్చారనిఆయన అభిప్రాయమా అన్న విషయం చెప్పనే లేదు. ఒకవేళ జయసూర్య అంత మంచి అధికారి అయితే కూటమి ప్రభుత్వం ఎందుకు యాక్షన్ తీసుకుంది అనే దానికీ ఆయన క్లారిటీ ఇవ్వలేదు. పైగా కొన్ని రకాలపేకాటకు అనుమతి ఉందంటూ ఆయన చెప్పుకు వచ్చారు. ఇప్పుడు అంతా "%ూశ్రీశ్రీ ఱం ఔవశ్రీశ్రీ%" అంటూ చెప్పుకొస్తున్న కూటమి అధినేతల మధ్య రఘు రామ కృష్ణ రాజు మాటలు పెద్ద గందరగోళాన్నేసృష్టించాయి. ఏపీ రాజకీయాల్ని గమనిస్తే ఒక్క విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతోందని విశ్లేషకులు అంటారు. అదే 'పవన్ కళ్యాణ్‌కు కోపం వచ్చే ఏ పనీ చంద్రబాబు, లోకేష్ చేయడం లేదు ". పవన్ చెప్పినప్రాంతంలో వెంటనే రోడ్లు పడుతున్నాయి. పవన్'లులు'పై విమర్శలు చేస్తే వెంటనే చంద్రబాబు కూడా వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి కందుకూరు బాధితులకు అంతటి ఉదార నష్ట పరిహారం ప్రకటనవెనుక కూడా పవన్ కి ఆ అంశంలో కోపం రాకూడదనే ఆలోచన అనే వాదన ఉంది. పవన్‌కి కోపం వస్తే బీజేపీ అధిష్టానానికి కోపం వచ్చినట్టే అని ప్రస్తుతం టీడీపీ భావిస్తోంది అనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. అదేటీడీపీ చర్యల్లో స్పష్టంగా కనపడుతోంది. కూటమిలోని కింది స్థాయి నేతల్లో ఇది కనపడడం లేదు. తమను లెక్కల్లోకి తీసుకోవడం లేదని టీడీపీ నేతలపై జనసేన ఎమ్మెల్యే లు, ఇతర నేతలు పదే పదే ఆరోపించినా పవన్‌వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేసుకుంటూ వచ్చారు. కానీ ఇప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితి పవన్‌కు అర్థం కావడంతో ఆయనే కొన్ని అంశాలపై సీరియస్ కావడం మొదలు పెట్టారు. ఇది టీడీపీ అధి నాయకత్వాన్ని కాస్తంఆలోచనలో పడేసింది. ఇలాంటి పరిస్థితిల్లో ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై పవన్ విమర్శలు చేయడం వెంటనే ప్రభుత్వం స్పందించి అతనిపై చర్యలు తీసుకోవడం వరకూ బాగానే ఉన్నా ఇప్పుడు

అదే అధికారికి అధికార టీడీపీ ఎమ్మెల్యే అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణరాజు మద్దతుగా మాట్లాడడం కూటమిని ఉలిక్కిపడేలా చేసింది. దీనితో చంద్రబాబు,పవన్ కళ్యాణ్,లోకేష్, అనిత లాంటి వాళ్ళుచెబుతున్నట్టు నిజంగా కూటమిలో అంతా "అల్ ఈజ్ వెల్ " అనే మాట నిజమేనా అన్న కొత్త చర్చ ఏపీ ప్రజల్లో మొదలైంది. అయితే డిప్యూటీ స్పీకర్, ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు మాత్రం అదే డీఎస్పీకిక్లీన్ చిట్ ఇవ్వడం ఇప్పుడు కూటమి పార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. డీఎస్పీ జయసూర్యకు మంచి ట్రాక్ రికార్డు ఉందని రఘురామ కృష్ణరాజు కితాబిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాల్లో జూదంపై పోలీసులు పట్టిష్టమైన నిఘా పెట్టారని అన్నారు. అందుకే డీఎస్పీపై ఆరోపణలు కొందరు పనిగట్టుకుని చేస్తున్నారని రఘురామ కృష్ణరాజు అభిప్రాయపడ్డారు. తన నియోజకవర్గమైన ఉండిలో ఎలాంటి జూదం జరగడం లేదని, పేకాట శిబిరాలునడవడం లేదని స్పష్టం చేశారు.

దీంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డీఎస్పీపై నివేదిక కోరితే డిప్యూటీ స్పీకర్ మాత్రం క్లిన్ చిట్ ఇవ్వడం హాట్ హాట్ గా మారింది నిజానికి గోదావరి జిల్లాల్లో పేకాట అనేది సాధారణమని,కోడిపందేలు ఎలాగో పేకాట కూడా అలాగే ఆడుకుంటారని, అది జూదం కాదని కొందరు టీడీపీ నేతలు అంటున్నారు. కానీ డీఎస్పీ జయసూర్య మాత్రం జూదగృహాలను ప్రోత్సహిస్తున్నారని పవన్ కళ్యాణ్ కు సమాచారంఇచ్చిందెవరన్న దానిపై టీడీపీ నాయకత్వం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. భీమవరం ఎమ్మెల్యే జనసేనకు చెందిన వారే కావడం విశేషం. ఈ నేపథ్యంలోడీఎస్పీ వ్యవహారంలో పవన్ కళ్యాణ్ అలా ఎందుకు స్పందిచాల్సి వచ్చింది? వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఎందుకు రియాక్ట్ కావాల్సి వచ్చిందన్న దానిపై మాత్రం క్లారిటీ లేదు. మొత్తం మీద ఏదోజరుగుతుందన్న అనుమానం మాత్రం టీడీపీ అగ్రనాయకత్వంలో బయలుదేరింది. ఎస్పీ ఇప్పటికే డీఎస్పీ జయసూర్యపై విచారణ జరుపుతున్నారు. విచారణ జరుగుతున్న సమయంలో డిప్యూటీ స్పీకర్ ఈ వ్యాఖ్యలు చేయడంపై చర్చ నడుస్తుంది

# టార్గెట్ అనిత



**శ్రీకాకుళం, అక్టోబరు 24, పెన్ పవర్:** వైసీపీ నేతలకు హోంమంత్రి వంగలపూడి అనిత టార్గెట్ అయ్యారనిపిస్తుంది. తరచూ వంగలపూడి అనిత జగన్ ను ఏకవచనంతో సంభోదించడంతో పాటు జగన్ ను పులివెందుల ఎమ్మెల్యేగా పదే పదే అనితమాట్లాడుతుండటతో వైసీపీ నేతలు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారన్న అభిప్రాయంలో టీడీపీ నాయకత్వం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఏదో ఒక ఘటన జరుగుతుంది. హత్యలు, అత్యాచారాలు జరిగినప్పుడల్లా వైసీపీ నేతలు వెంటనే అక్కడకు వాలిపోయి శాంతిభద్రతల సమస్య అంటూ గళమెత్తుతున్నారు. కందుకూరులో వాహనంతో తొక్కించి చంపిన ఘటన కావచ్చు. తునిలో బాలికపై టీడీపీ నేత అత్యాచారానికి ప్రయత్నించినఘటన కావచ్చు. అనిత పైనే వైసీపీ నేతలు విమర్శలు ఎక్కుపెడుతున్నారు.. ఇక వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో బల్క్ డ్రగ్ పార్క్ పై కూడా వైసీపీ అక్కడి మత్స్యకారులకు అండగా నిలిచింది. అక్కడి మత్స్యకారులు తమ ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ అవసరం లేదని ఆందోళన చేస్తున్నారు. అయితే జగన్ ఆదేశాల మేరకు వైసీపీ నేతలు నిన్న రాజయ్యపేట గ్రామానికి వెళ్లారు. అక్కడ బల్క్ డ్రగ్ పార్క్ కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులకు మద్దతు ప్రకటించారు. జగన్ కూడా త్వరలోనే ఈ ప్రాంతంలో పర్యటిస్తారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. అంటే నేరుగాహోంమంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావు పేట నియోజకవర్గంలో జగన్ పర్యటన మరింత హీట్ ను పెంచుతుందని భావిస్తున్నారు. మరొకవైపు రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నా, తమ పార్టీ కార్యకర్తలపై నమోదవుతున్న అక్రమ కేసులతో పాటు, పలు అంశాలు వైసీపీ అధినేత జగన్ పై చేస్తున్న విమర్శలు హోంమంత్రి అనితను లక్ష్యంగా చేసుకున్నారని టీడీపీ నేతలుఅంటున్నారు. అయితే వైసీపీ నేతలు మాత్రం తాము వంగలపూడి అనితను ఎందుకు లక్ష్యంగా చేసుకుంటామని, ఒక ఘటన జరిగినప్పుడు ప్రతిపక్ష పార్టీగా ఖచ్చితంగా స్పందిస్తామని, హోంమంత్రిగా ఎవరున్నా తమరియాక్షన్ అలాగే ఉంటుందని, ఇందులో ప్రత్యేకించి ఒకరిని లక్ష్యంగా చేసుకునేది ఉండదని వైసీపీ నేతలు అంటున్నారు. మొత్తం మీద వైసీపీ వర్సెస్ వంగలపూడి అంటూ సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ మాత్రంపెద్దయెత్తున కామెంట్స్ పెడుతుంది.

# కొలికపూడి పై చర్యలకు రంగం సిద్ధం



**విజయవాడ, అక్టోబరు 24, పెన్ పవర్:** రాజకీయాలలో ఉన్నప్పుడు ఒక మాటకు కట్టుబడి ఉండాలి. ఒక పార్టీ గుర్తు మీద గెలిచినప్పుడు.. పార్టీ విధానాలకు లోబడి పని చేయాలి. అలా కాకుండా గెలిచిన తర్వాత నా ఇష్టం వచ్చినట్టు చేస్తా.. నాకు నచ్చినట్టుఉంటా.. అని అంటే కుదరదు. ప్రస్తుతం ఏపీలోని టిడిపి లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా ఆ పార్టీ తిరువూరు ఎమ్మెల్యే అడ్డగోలుగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే ఒకసారి ఆయన అధినేత ఆగ్రహాన్ని చవిచూశారు. ఇప్పుడు ఏకంగా మరింత కవ్వింపు చర్యలకు దిగారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరువూరు నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన విజయంసాధించారు. అంతకుముందు శ్రీనివాసరావు కొన్ని ప్రైవేట్ న్యూస్ చానల్స్ డిబేట్ల లో పాల్గొనేవారు. విషయ పరిజ్ఞానం ఉన్న నేపథ్యంలో శ్రీనివాసరావు కు చంద్రబాబు టికెట్ ఇచ్చారు. వైసిపి పరిపాలనపై విసుగు చెందినప్రజలు శ్రీనివాసరావుకు జై కొట్టారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఏదో ఒక వివాదంలో శ్రీనివాసరావు ఉంటూనే ఉన్నారు.. అప్పట్లో టిడిపి నేత రమేష్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు ఆందోళనచేశారు. ఏకంగా ధర్నా చేసి తిరువూరులో సంచలనం సృష్టించారు. దానిని మర్చిపోయిన తర్వాత ఇంకా కొన్ని భూ వివాదాలలో వేలు పెట్టారు. ఇవన్నీ కూడా పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిపోయాయి. దీనికితోడు ఆయన వ్యవహార శైలి కూడా కింది స్థాయి కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల కాలంలో శ్రీనివాసరావు మీద అధిష్టానానికి విపరీతంగా ఫిర్యాదులు వస్తున్నాయి. అప్పట్లో రమేష్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు ఆందోళన చేసినప్పుడు.. వైసిపి అనుకూల మీడియా విపరీతమైన ప్రచారం కల్పించింది. శ్రీనివాసరావుతో అప్పట్లో చంద్రబాబు మాట్లాడారు. ఆ తర్వాత సమస్య పరిష్కారానికి కృషి చేశారు. అంతటితోనే శ్రీనివాసరావు ఆగలేదు. ఇప్పుడు ఏకంగా విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని చిన్ని పై శ్రీనివాసరావు విమర్శలు చేశారు. ఇందులో డబ్బుల వ్యవహారాన్ని తెరపైకి తీసుకురావడంతో ఒక్కసారిగా సంచలనంగా మారింది. తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తాను చిన్నికి ఐదు కోట్లు ఇచ్చినట్టు శ్రీనివాసరావు ఆరోపించారు. బ్యాంకు స్టేట్మెంట్ కూడా వాట్సాప్ పెట్టారు.. అనేక పర్యాయాలు తాను డబ్బులు పంపించినట్టు అందులో శ్రీనివాసరావు పేర్కొన్నారు. అయితే దీనిపై చిన్ని కూడా స్పందించారు. దొంగే దొంగని అరుస్తున్నాడని.. ఆ ఆరోపణలపై సాక్ష్యాలు కూడా ఇవ్వాలని చిన్ని డిమాండ్ చేశారు. తాను డబ్బులు సంపాదించుకోవాలనుకుంటే తిరువూరు దాకా అవసరం లేదని.. ఎలాంటి వ్యాపారాలు చేసిన సరే డబ్బులు వస్తాయని చిన్ని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై శ్రీనివాసరావు, చిన్నిని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడుపల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఎన్టీఆర్ భవన్ కు రావాలని ఆదేశాలు జారీ చేశారు. టిడిపి అనుకూల మీడియా మాత్రం శ్రీనివాసరావు వ్యవహార శైలిపై మరో విధంగా కథనాలను ప్రసారం చేస్తోంది. శ్రీనివాసరావుకు ఇప్పటికే

అనేక అవకాశాలను చంద్రబాబు ఇచ్చారని.. ఇకపై ఇచ్చే ప్రసక్తి లేదని.. పార్టీ నుంచి బయటికి పంపించడమే మిగిలి ఉందని చెబుతున్నాయి. దీంతో శ్రీనివాసరావుకు ఉద్వాసన తప్పదని తెలుస్తోంది. అయితేశ్రీనివాసరావును బయటికి పంపించే విషయంపై ఇంతవరకు టిడిపి అధికారికంగా ప్రకటన చేయలేదు. ప్రస్తుతం చంద్రబాబు విదేశాలలో ఉన్నారు. శ్రీనివాసరావు వ్యవహారంపై ప్రభుత్వం నుంచి ఒక క్లారిటీ రావాలంటేఇంకా కాస్త సమయం పడుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ శ్రీనివాసరావు వల్ల కూటమి ప్రభుత్వానికి ఇబ్బంది తప్పడం లేదని సమాచారం.

## నాకౌట్‌కు రంగం సిద్ధం: వరల్డ్ కప్ సెమీ ఫైనల్.. షెడ్యూల్, వేదికలు, టైమింగ్స్ వివరాలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ క్లైమాక్స్ కు చేరుకుంది. లీగ్ దశలో మరో నాలుగు మ్యాచ్ లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ మ్యాచ్ లతో సంబంధం లేకుండా సెమీస్ కు చేరే జట్లేవో తెలిసిపోయాయి. ఇండియాతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు సెమీస్ కు అర్హత సాధించాయి. ఈ నాలుగు జట్లు తమ చివరి లీగ్ మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్ లు ముగిశాక ఏ జట్టుతో ఏ జట్టు సెమీ ఫైనల్ ఆడుతుందో తెలుస్తుంది. భారత మహిళల జట్టు నాలుగో స్థానంలో ఉంటుంది కాబట్టి రెండో సెమీ ఫైనల్ ఆడుతుంది. చివరి మ్యాచ్ లో ఆదివారం (అక్టోబర్ 26) బంగ్లాదేశ్ తో తలపడాల్సి ఉంటుంది. ఈ మ్యాచ్ లో మన మహిళల జట్టు గెలిచినా ఓడిపోయినా నాలుగో స్థానంలోనే ఉంటుంది. ఆస్ట్రేలియా (11) లేదా సౌతాఫ్రికా (10) జట్లకు మాత్రమే టేబుల్ టాప్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. శనివారం (అక్టోబర్ 25) ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ రెండు జట్లలో గెలిచిన జట్టు టేబుల్ టాపర్ అవుతుంది. ఇండియా సెమీస్ ఆస్ట్రేలియా లేదా సౌతాఫ్రికాతోనే ఆడాల్సి ఉంటుంది. మరోవైపు ఇంగ్లాండ్ తొలి సెమీస్ ఆడనుంది. ఇంగ్లాండ్ ప్రత్యర్థి కూడా సౌతాఫ్రికా లేదా ఆస్ట్రేలియా మ్యాచ్ తో తేలిపోతుంది. ఏదేమైనా రేపు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య మ్యాచ్ రద్దు కాకుండా ఫలితం వస్తే సెమీ ఫైనల్ ప్రత్యర్థులపై క్లారిటీ వస్తుంది.

**సెమీ ఫైనల్, ఫైనల్ షెడ్యూల్:**

**తొలి సెమీ ఫైనల్:** అక్టోబర్ 29- బుధవారం- గౌహతి, బార్సపార క్రికెట్ స్టేడియం (మధ్యాహ్నం 3:00 గంటలకు)

**రెండో సెమీ ఫైనల్:** అక్టోబర్ 30- గురువారం- నవీ ముంబై, డివై పాటిల్ స్టేడియం (మధ్యాహ్నం 3:00 గంటలకు)

**ఫైనల్ మ్యాచ్:** వేదిక ఖరారు కాలేదు- నవంబర్ 2 (మధ్యాహ్నం 3:00 గంటలకు)

**సెమీస్ కు చేరుకున్న నాలుగు జట్లు:**

ఆస్ట్రేలియా (11)
సౌతాఫ్రికా (10)
ఇంగ్లాండ్ (9)
ఇండియా (8)

## స్మృతి క్రీడాస్ఫూర్తి: ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును రావల్‌కు షేర్ చేసిన మంధాన



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ లో టీమిండియా సెమీస్ కు దూసుకెళ్లింది. గురువారం (అక్టోబర్ 23) న్యూజిలాండ్ పై ఖచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్ లో విజయం సాధించి సెమీస్ సమరానికి అర్హత సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (95 బాల్స్‌లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 109), ప్రతీకా రావల్ (134 బాల్స్‌లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 122) సెంచరీలతో దుమ్మురేపడంతో.. గురువారం (అక్టోబర్ 23) జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఇండియా 53 రన్స్ (డక్ వర్త్ లూయిస్) తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. ఈ మ్యాచ్ లో సూపర్ సెంచరీ చేయడంతో పాటు ఒక స్టన్నింగ్ క్యాచ్ అందుకున్న మంధానకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ప్రెజెంటేషన్ సమయంలో స్మృతి తన క్రీడాస్ఫూర్తితో అందరి మనసులను గెలుచుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ను తన సహచర ప్లేయర్ ప్రతీక రావల్ కు షేర్ చేసింది. టీమిండియా ఓపెనర్ తీసుకున్న ఈ నిర్ణయంతో సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ మ్యాచ్ లో మందనతో పాటు రావల్ సెంచరీతో అదరగొట్టింది. తొలి వికెట్ కు వీరిద్దరి జోడీ ఏకంగా 212 పరుగులు జోడించి జట్టుకు భారీ స్కోర్ అందించారు. రావల్ 122 పరుగులు చేస్తే స్మృతి 109 పరుగులు చేసింది. ఎక్కువ స్ట్రైక్ రేట్ కారణంగా స్మృతి మందనాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే వర్షం వల్ల ఈ మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడిన ఇండియా ఓవర్లన్నీ ఆడి 3 వికెట్ల నష్టానికి 340 పరుగులు చేసింది. జెమీమా రొడ్రిగ్స్ (55 బాల్స్‌లో 11 ఫోర్లతో 76 నాటౌట్) చెలరేగింది. తర్వాత న్యూజిలాండ్ టార్గెట్‌ను 44 ఓవర్లలో 325 రన్స్‌గా నిర్దేశించారు. దీన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కివీస్ 271/8 స్కోరుకే పరిమితమైంది. బ్రూక్ హాలీడే (84 బాల్స్‌లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 81) టాప్ స్కోరర్. ఇసాబెల్లా గాజె (51 బాల్స్‌లో 10 ఫోర్లతో 65 నాటౌట్) పోరాడి విఫలమైంది. రేణుకా సింగ్, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు తీశారు. మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

## నేడు (అక్టోబర్ 25) సిడ్నీలో మూడో వన్డే.. ఇండియా, ఆస్ట్రేలియా తుది జట్లు ఇవే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ను టీమిండియా కోల్పోయింది. ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 0-2 తేడాతో ఆసీస్ జట్టుకు సిరీస్ ను అప్పగించింది. శనివారం (అక్టోబర్ 25) సిడ్నీ వేదికగా ఇరు జట్ల మధ్య నామమాత్రపు మ్యాచ్ జరగనుంది. చివరి వన్డేలోనూ గెలిచి ఇండియాను క్లీన్ స్వీప్ చేయాలని ఆతిధ్య ఆస్ట్రేలియా భావిస్తోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్ కోల్పోయిన భారత జట్టు చివరి వన్డేలో గెలిచి పరువు నిలుపుకోవాలని చూస్తుంది. టాస్ ఉదయం 9:00 గంటలకు వేస్తారు. ఈ మ్యాచ్ లో ఇరు జట్ల ప్లేయింగ్ 11 ఎలా ఉండబోతుందో ఇప్పుడు చూద్దాం.

సిడ్నీ వన్డేలో ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్లు స్టార్క్, హేజల్ వుడ్ లకు రెస్ట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో నెల రోజుల్లో యాషెస్ ఉండడమే ఇందుకు కారణం. ఎలాగో సిరీస్ వచ్చింది కాబట్టి బెంచ్ ను పరీక్షించే అవకాశాలు లేకపోలేదు. స్టార్క్, హేజల్ వుడ్ స్థానాల్లో నాథన్ ఎల్లిస్, బెన్ ద్వార్షుయిస్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏ రెండు మార్పులు మినహాయిస్తే రెండో వన్డేలో ఆడిన జట్టుతోనే ఆసీస్ ఆడొచ్చు. బ్యాటింగ్ లో ఎలాంటి మార్పులు చేసే అవకాశాలు కనిపించడం లేదు.

**కుల్దీప్ కు ఛాన్స్:**

సిడ్నీ వన్డేలో వాషింగ్ టన్ సుందర్ స్థానంలో స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కు తుది జట్టులో స్థానం దక్కొచ్చు. తొలి రెండు వన్డేల్లో సుందర్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. కుల్దీప్ ను ప్లేయింగ్ 11 లో చేర్చి స్పిన్ బౌలింగ్ లో బలహీనమైన ఆస్ట్రేలియాకు చెక్ పెట్టాలని ఇండియా భావిస్తోంది. ఫాస్ట్ బౌలర్లుగా సిరాజ్ తో పాటు అర్షదీప్ కొత్త బంతిని పంచుకోనున్నాడు. హర్షిత్ రానా ఉంటాడా లేదా అనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది.

ఓపెనర్లుగా కెప్టెన్ గిల్ తో పాటు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఇన్నింగ్స్ ను ఆరంభించనున్నారు. టాలెంటెడ్ బ్యాటర్ యశస్వి జైశ్వాల్ బెంచ్ కే పరిమితం కానున్నాడు. మూడో స్థానంలో కోహ్లీ స్థానానికి తిరుగులేదు. నాలుగో స్థానంలో వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బరిలోకి దిగుతాడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ గా రాహుల్ బ్యాటింగ్ చేయనున్నాడు. ఆరో స్థానంలో ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి.. ఏడో స్థానంలో స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ఏడో స్థానంలో బరిలోకి దిగనున్నారు.

**ఆస్ట్రేలియాతో మూడో వన్డేకు ఇండియా ప్లేయింగ్ 11 (అంచనా):**

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రానా, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్

## సమంత ఈజ్ బ్యాక్.. ఘనంగా ప్రారంభమైన షూటింగ్!







ఒకప్పుడు స్టార్ పొజిషన్ లో ఉన్న చాలామంది నటీమణులు కాలం మారుతున్న కొద్దీ ఇండస్ట్రీలకు కొత్త కొత్త నటీమణులు రావడంతో సీనియర్ లకి అవకాశాలు తగ్గిపోయి ఫేడౌట్ అయిపోతూ ఉంటారు. అలా ఇప్పటికే ఎంతోమంది సీనియర్ నటీమణులకు హీరోయిన్ గా అవకాశాలు తగ్గిపోయినప్పటికీ కీ రోల్స్, ఐటెం సాంగ్స్, స్పెషల్ పాత్రల్లో చేస్తూ సినిమాల్లో రాణిస్తున్నారు. కొంతమంది నటీమణులు లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో చేస్తున్నారు. అయితే తాజాగా హీరోయిన్ సమంత చాలా రోజులకి తన కొత్త సినిమాని అనౌన్స్ చేసింది. తెలుగులో ఖుషి మూవీ తర్వాత మళ్లీ ఫుల్ లెంగ్త్ పాత్రలో సమంత కనిపించలేదు.

ఈ ఏడాది సమంత నిర్మాతగా చేసిన శుభం మూవీలో కనిపించినప్పటికీ అది కేవలం అతిథి పాత్ర వరకే పరిమితమైంది. ప్రస్తుతం సమంతని ఫుల్ లెంగ్త్ పాత్రలో చూడడం కోసం ఆమె అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. ఇలాంటి నేపథ్యంలో సమంతకు సంబంధించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ వార్త వైరల్ అవుతోంది. అదేంటంటే సమంత కొత్త సినిమాకు సంబంధించిన షూటింగ్ నిన్నటి నుండి ప్రారంభమైందట. సమంత ప్రస్తుతం తన సొంత బ్యానర్ అయినటువంటి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమా చేస్తున్న సంగతి మనకు తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడో అనౌన్స్ చేసినప్పటికీ ఇప్పటివరకు పట్టాలెక్కడం లేదు. అయితే రీసెంట్ గానే సమంత అక్టోబర్ లో తన కొత్త మూవీ అయినటువంటి మా ఇంటి బంగారం సినిమా షూటింగ్ స్టార్ట్ అవుతుందని చెప్పింది.చెప్పినట్లుగానే మా ఇంటి బంగారం సినిమా షూటింగ్ నిన్నటి నుండి స్టార్ట్ చేశారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ హైదరాబాదులో నిన్నటి నుండి ప్రారంభమైంది.. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై వస్తున్న ఈ మూవీకి లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తోంది.అయితే ఈ సినిమా షూటింగ్ నిన్నటి నుండి స్టార్ట్ అవ్వడంతో ఈ సినిమాకి సంబంధించిన మిగతా అప్డేట్లు త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.. అలా కొత్త సినిమా షూటింగ్లో బిజీగా ఉన్న సమంత మొత్తానికైతే కం బ్యాక్ ఇచ్చేసిందని చెప్పవచ్చు.ఇదిలా ఉండగా తాజాగా మరో విషయంతో కూడా సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో నిలిచింది సమంత..అదే దీపావళి సెలబ్రేషన్స్ ని తన రూమార్డ్ బాయ్ ఫ్రెండ్ గా పేరున్నటువంటి రాజ్ నిడిమోరు తో కలిసి చేసుకోవడమే.. కొద్ది రోజుల నుండి సమంత ఎక్కడికి వెళ్ళినా సరే రాజ్ నిడిమోరు తోనే కలిసి వెళుతుంది. వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నట్టు వార్తలు వినిపించినప్పటికీ సమంత మేనేజర్ ఈ వార్తల్ని ఖండించారు. కానీ వీరి మధ్య రిలేషన్ ఉందనే వార్తలకు బలం చేకూర్చేలా ప్రతిసారి వీరిద్దరూ ఎక్కడో ఒక దగ్గర అడ్డంగా బుక్ అవుతున్నారు.అలా తాజాగా సమంత ఈ ఏడాది దీపావళి సెలబ్రేషన్స్ ని తన రూమర్డ్ బాయ్ ఫ్రెండ్ రాజ్ నిడిమోరుతో కలిసి జరుపుకోవడమే కాకుండా వాటికి సంబంధించిన ఫోటోలను కూడా నెట్టింట షేర్ చేయడంతో ఈ ఫొటోస్ కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మరి కొత్త సినిమా గుడ్ న్యూస్ చెప్పినట్టే సమంత రెండో పెళ్లికి సంబంధించిన గుడ్ న్యూస్ కూడా త్వరలోనే చెబుతుందా అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com